జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి ఆదివారం 24 ఆగస్టు 2025 సంపుటి : 15 సంచిక : 263 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528



## ఏపీ ఆర్థిక పరిస్థితిపై వైఎస్ జగన్ ఆందోళన

- 'రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు భారీగా తగ్గి, అప్పులు పెరిగి పోతున్నాయి
- కూటమి ప్రభుత్వ విధానాలతోనే ఈ పరిస్థితి ఏర్పడింది
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి
- 2019-24 మధ్య మా ప్రభుత్వంపై టీడీపీ, జనసేన పార్టీలు పదేపదే అబద్దాలు చెప్పాయి.


# పారిశుద్ధ్య కార్మికులకు ప్రమాద బీమా రూ. కోటి



- 55,686 మందికి మేలు కలిగేలా యాక్సిస్ బ్యాంక్ శాలరీ అకౌంట్లు
- కార్మికుల కోసం ప్రమాద, ఆరోగ్య బీమా స్కీంను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఈ కొత్త ఆర్థిక సదుపాయం ద్వారా మున్సిపల్ కార్మికులకు గణనీయమైన భరోసా లభించనుంది.

**పెద్దాపురం**

మున్సిపల్ కార్మికులు, వారి కుటుంబాలకు సంక్షేమం, భద్రత అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రమాద, ఆరోగ్య బీమా స్కీంను లాంఛనంగా ప్రారంభించారు. పట్టణాభివద్ధి శాఖ-ఆక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా ఈ స్కీంను అమలు చేసేలా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇప్పటికే మున్సిపల్ కార్మికుల శాలరీ ప్యాకేజ్ ఖాతాలు - మిగతా3లో



## భారత్‌తో సమస్య ఉంటే..

### ట్రంప్‌కు జైశంకర్ స్పష్టం

- దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి
- భారత్-అమెరికా మధ్యవాణిజ్య చర్చలు దఇంకా కొనసాగుతున్నాయి
- అయితే మన దేశానికంటూ కొన్ని ప్రయోజనాలున్నాయి
- మన రైతులు, చిన్నస్థాయి ఉత్పత్తిదారుల ప్రయోజాలను కాపాడేందుకే తమ ప్రాధాన్యత



## 2035 నాటికి భారత్‌కు సొంత అంతరిక్ష కేంద్రం

- అంతరిక్ష రంగంలో కొత్త పుంతలు తొక్కుతున్నది
- ప్రధాని మోదీ అందించిన దిశ, దార్శనికతల ఆధారంగా చంద్రయాన్-4 మిషన్ మనకు సాకారమయ్యింది
- వీనస్ ఆర్బిటర్ మిషన్‌కు కూడా చేరువయ్యాం
- ఇస్రో చైర్మన్ వీ నారాయణన్

# ఇప్పటిదాకా ఓ లెక్క.. ఇప్పటినుంచి మరో లెక్క

### ఏపీ జేఏసీ అమరావతి

ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యలు తీరుస్తామని గతంలో చంద్రబాబు చెప్పారు

జూన్‌లో జరగాల్సిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఆగస్టులో జరిగాయి.


సీఎస్ఎంఎఫ్‌లో సంబంధం లేకుండా ప్లే స్లిప్‌లో మా బకాయిలు చూపించాలి



**విజయవాడ**

మూడు నెలల్లో పెండింగ్ బకాయిలు క్లీయర్ చేయకపోతే పోరుబాట పడతామని చంద్రబాబు సర్కార్‌ను ఏపీ జేఏసీ అమరావతి హెచ్చరించింది. శనివారం కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వంపై మా వైఖరీలో "ఇప్పటివరకు ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క" అంటూ తేల్చి చెప్పింది. ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు మాట్లాడుతూ.. ఏడాది దాటినా కానీ.. సీఎం, కేబినెట్ ఉపసంఘం మాతో చర్చించలేదన్నారు. ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యలు తీరుస్తామని గతంలో చంద్రబాబు చెప్పారు. జూన్‌లో జరగాల్సిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఆగస్టులో జరిగాయి. ఏ అంశం పరిష్కారం కాలేదు" అని ఆయన మండిపడ్డారు. "ఒక్కో ఉద్యోగికి మూడు నుండి 5లక్షలు, రిటైర్డ్ ఉద్యోగులకు 15 నుండి 20 లక్షలు బకాయిలు ఉన్నాయి. సీఎస్ఎంఎఫ్‌లో సంబంధం లేకుండా ప్లే స్లిప్‌లో - మిగతా3లో

## రియల్ మనీ గేమ్‌ల నిలిపివేత



ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదం లభించినందున.. చట్టంగా మారింది. ఇందులో ఏ క్లాజులు ముందుగా అమల్లోకి తెస్తారనే విషయాలపై ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్ స్పష్టతనిచ్చారు. 'ప్రతిపాదిత నిబంధనలపై ఐటీ శాఖ పనిచేస్తోంది. ఇస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషియల్ గేమ్స్ ప్రోత్సాహం, నియంత్రణ విషయంలో ఒక వ్యవస్థను తీసుకొస్తారు. అదే సమయంలో ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్-2025లో పేర్కొన్న నియంత్రణ సంస్థను ఏర్పాటు చేస్తార'ని కృష్ణన్ వివరించారు. ఈ చట్టం ద్వారా దేశంలో అన్నిరకాల ఆన్‌లైన్ మనీ గేమ్స్‌పై నిషేధం విధించగా, ఇప్పటికే సంస్థలు రియల్ మనీ గేమ్‌లను నిలిపివేశాయి.



## 2026లో తమిళనాడులో చరిత్ర సృష్టిస్తాం

- మధురై సభను విజయవంతం చేసిన మద్దతుదారులకు విజయ్ కృతజ్ఞతలు
- విమర్శల్లోని మంచిని మాత్రమే స్వీకరించి ముందుకు సాగుతామని వెల్లడి
- విభజన శక్తులకు, కపట రాజకీయాలకు తమ పార్టీ వ్యతిరేకమని స్పష్టీకరణ
- 1967, 1977 నాటి చారిత్రక తీర్పు 2026లో పునరావృతమవుతుందని ధీమా
- పని మాత్రమే రాజకీయాల మాతృభాష అని కీలక వ్యాఖ్య



## పార్లమెంటులో వీఐపీల భద్రతకు సవాల్‌గా మారిన 'నెంబర్.1 చెట్టు'

- కొత్త పార్లమెంట్ వద్ద భద్రతకు అడ్డంకిగా మారిన ఓ చెట్టు
- వీవీఐపీలు వెళ్లే మార్గంలో ఉండటంతో సమస్యగా గుర్తింపు
- 'నంబర్ 1 చెట్టు'గా సిబ్బంది పిలుచుకునే ఈ వృక్షం
- చెట్టును తరలించాలని నిర్ణయించిన స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ)

# తెలుగు సెంటిమెంట్ పండుతుందా?

- రైతులను ఆదుకునే పక్షానికే తాము ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతి ఇస్తామని బీఆర్ఎస్
- ఇండియా కూటమి అభ్యర్థి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి






## భారత్‌కు అమెరికా కొత్త రాయబారి

- గతంలో ఎలాన్ మస్క్ 'పాము' అని పిలిచింది ఇతడినే!
- భారత్‌కు అమెరికా కొత్త రాయబారిగా సెర్జియో గోర్ నామినేట్
- గోర్ సెక్యూరిటీ క్లియరెన్స్‌పై అనుమానాలతో రాజుకున్న వివాదం
- మస్క్ ట్రంప్ మధ్య దూరం పెంచడంలో గోర్ పాత్ర ఉందన్న ఆరోపణలు
- ట్రంప్ ప్రభుత్వంలో కీలక నియామకాల అధికారిగా పనిచేసిన గోర్
- మస్క్‌ను కీలక సమావేశాలకు దూరం పెట్టారంటూ మీడియా కథనాలు

# భారత్‌తో సమస్య ఉంటే..

## ట్రంప్‌కు జైశంకర్ స్పష్టం



**న్యూఢిల్లీ:** రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తోందన్న ఏకైక కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలు విధించడంపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని ఆయన మరోమారు స్పష్టం చేశారు. భారత్‌తో ఏదైనా సమస్య ఉన్న పక్షంలో ఈ దేశపు ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు జైశంకర్ స్పష్టం చేశారు. 'ఎకనమిక్ టైమ్స్' ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో ఎస్ జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రష్యా చమురు కొనుగోలు విషయంలో భారత్‌పై వెల్లువెత్తుతున్న విమర్శల అంశాన్ని ప్రస్తావించారు. భారత్–అమెరికా మధ్యవాణిజ్య చర్చలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. అయితే మన దేశానికంటూ కొన్ని ప్రయోజనాలున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. మన రైతులు, చిన్నస్థాయి ఉత్పత్తిదారుల ప్రయోజాలను కాపాడేందుకే తమ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, వ్యాపార అజెండాతో వ్యవహరిస్తున్న అమెరికా యంత్రాంగానికి మద్దతు పలుకుతూ, కొందరు తమపై నిందలు వేయడం హాస్యాస్పదమని జైశంకర్ పేర్కొన్నారు. నిజంగా మీకు(అమెరికాకు) భారత్‌తో సమస్య ఉంటే, ఈ దేశపు చమురును, శుద్ధి చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయకండి. వాటిని కొనాలంటూ మిమ్మల్ని ఎవరూ బలవంతం చేయడంలేదు. అవి మీకు నచ్చకపోతే కొనకండంటూ జైశంకర్ స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ అదనపు సుంకాల గురించి పూర్తిగా ప్రకటించడానికి ముందే, తాము రష్యా చమురు అంశం గురించి అమెరికాతో తాము ఎలాంటి చర్చలు జరపలేమని జైశంకర్ అన్నారు.

**ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన విదేశాంగ మంత్రి**


భారత్ – పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు తాము మధ్యవర్తిత్వం చేశామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సంబంధాల్లో మూడో దేశం జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఆయన స్పష్టంచేశారు. ఢిల్లీలో జరిగిన 'ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్ 2025' సదస్సులో జైశంకర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది మే నెలలో భారత్–పాక్ మధ్య నాలుగు రోజులపాటు నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో అమెరికా జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చిందని ట్రంప్ పదేపదే చెబుతున్న మాటల్లో నిజం లేదని అన్నారు. 'పాకిస్థాన్‌తో మా సంబంధాల్లో మధ్యవర్తిత్వాన్ని మేం అంగీకరించబోమని 1970 నుంచి అంటే దాదాపు 50 ఏళ్లుగా దేశంలో ఒక జాతీయ ఏకాభిప్రాయం ఉంది' అని జైశంకర్ అన్నారు. భద్రత, ఆర్థిక సహకారం వంటి రంగాల్లో అమెరికా–పాకిస్థాన్ సంబంధాలు మళ్లీ బలపడుతున్న తరుణంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ రెండుసార్లు అమెరికాలో పర్యటించారు. ఈ పర్యటనల్లో వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, క్రిప్టోకరెన్సీ నిబంధనల వంటి అంశాలపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జైశంకర్ దేశ ప్రయోజనాల విషయంలో తమ ప్రభుత్వ వైఖరిని కూడా స్పష్టం చేశారు. 'రైతుల ప్రయోజనాలు, దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, మధ్యవర్తిత్వ వ్యతిరేకత వంటి అంశాల్లో ఈ ప్రభుత్వం చాలా నిక్కచ్చిగా ఉంది' అని ఎస్ జైశంకర్ అన్నారు. తమ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే వారు ఆ విషయాన్ని భారత ప్రజలకు ధైర్యంగా చెప్పాలని సవాల్ విసిరారు. 'రైతుల ప్రయోజనాలను కాపాడటానికి మీరు సిద్ధంగా లేరని ప్రజలకు చెప్పండి. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి మీరు విలువ ఇవ్వడంలేదని చెప్పండి. మేం మాత్రం వీటికి కట్టుబడి ఉంటాం. వాటిని కాపాడుకోవడానికి ఏం చేయాలో అది చేస్తాం' అని జైశంకర్ గట్టిగానే అన్నారు.

# చైనాకు మోడీ ప్రోగ్రామ్ ఫిక్స్



**న్యూఢిల్లీ :** ఆగస్టు 31న జరిగే షాంఘై సహకార సంస్థ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనాలో పర్యటించనున్నారు. ఈ పర్యటన ఇటీవలి కాలంలో, ముఖ్యంగా తూర్పు లడఖ్‌లో సరిహద్దు ఉద్రిక్తతల తరువాత, దెబ్బతిన్న భారతదేశం–చైనా సంబంధాలలో ఒక కీలక మలుపుగా భావిస్తున్నారు. రెండు రోజుల జపాన్ పర్యటన తర్వాత ప్రధాని మోదీ ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ 1 వరకు చైనా నగరమైన టియాంజిన్‌లో పర్యటిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.ఏడు సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ చైనాకు ఇది తొలి పర్యటన అవుతుంది. ప్రాంతీయ, ప్రపంచ గతిశీలత అభివృద్ధి చెందుతున్న సందర్భంలో ఈ పర్యటన ప్రాముఖ్యతను సంతరించుకుంది. భారతదేశం అమెరికా నుండి వాణిజ్య ఒత్తిడిని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధాని మోదీ పర్యటన జరుగుతోంది. రష్యా చమురు భారత్ కొనుగోలును కొనసాగిస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ అమెరికా భారత దిగుమతులపై భారీ సుంకాలను విధించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖ్యంగా అనేక భారతీయ వస్తువులపై సుంకాలను రెట్టింపు చేసి, వాటిని 50 శాతానికి పెంచారు.ఈ సవాళ్ల మధ్య, భారతదేశం వివిధ దేశాలతో కొత్త ఒప్పందాలను అనుసరించడం ద్వారా తన వాణిజ్య సంబంధాలను వైవిధ్యపరచడానికి చురుకుగా కృషి చేస్తోంది. రాఅూ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనడం ఈ ప్రాంతంలో భారతదేశం దౌత్యపరమైన చేరిక, ఆర్థిక వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్లగలదని భావిస్తున్నారు న్యూఢిల్లీలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సమావేశం గురించి వివరాలను పంచుకుంటూ, భారతదేశం–చైనా రెండూ తమ దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి స్థిరమైన పురోగతి సాధిస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. "విదేశాంగ మంత్రి వాంగ్ యిని కలవడం ఆనందంగా ఉంది. గత సంవత్సరం కజాన్‌లో అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశం నుండి, భారతదేశం–చైనా సంబంధాలు ఒకరి ఆసక్తులు, సున్నితత్వాలను గౌరవించడం ద్వారా స్థిరమైన పురోగతిని సాధించాయి. రాఅూ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా టియాంజిన్‌లో మా తదుపరి సమావేశం కోసం నేను ఎదురు చూస్తున్నాను. భారత్–చైనా మధ్య స్థిరమైన, ఊహించదగిన, నిర్మాణాత్మక సంబంధాలు ప్రాంతీయ, ప్రపంచ శాంతి, శ్రేయస్సుకు గణనీయంగా దోహదపడతాయి, "అని ఆయన సోషల్ మీడియా ఖీలో పోస్ట్ చేశారు.

# ధర్మస్థల హత్యలు అబద్ధమే



**బెంగళూరు :** పుణ్యక్షేత్రం ధర్మస్థలలో సామూహిక అత్యాచారాలు, హత్యలు జరిగాయంటూ సంచలన ఆరోపణలు చేసిన ఫిర్యాదుదారుడిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అదుపులోకి తీసుకుంది. ఇప్పటివరకూ ఈ కేసులో బాధితుల పక్షాన మాట్లాడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అతడి ఆరోపణలన్నీ కల్పితమని, అవాస్తవమని తేలడంతో ఈ చర్య తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు.గత కొంతకాలంగా, తన ముఖం బయటపడకుండా ముసుగు ధరించి ఒక వ్యక్తి ధర్మస్థలలో ఘోరాలు జరిగాయంటూ ఆరోపణలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అతడిని విచారణకు పిలిచింది. గంటల తరబడి సాగిన విచారణలో అతడు చెప్పిన విషయాలకు, వాస్తవాలకు పొంతన లేదని అధికారులు గుర్తించారు.తాను చేసిన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించలేకపోవడంతో పాటు, చెప్పినవన్నీ కట్టుకథలని విచారణలో తేలింది. రెండు దశాబ్దాల కాలంలో ధర్మస్థల వ్యాప్తంగా బహుళ హత్యలు, అత్యాచారాలు మరియు ఖననాలు జరిగాయనే ఆరోపణలను ధర్మస్థల మంజునాథ స్వామి ఆలయ ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే తోసిపుచ్చారు. ఆయన రాఎ దర్యాప్తును కూడా స్వాగతించారు. చెప్పినట్టుగానే పదహారు ప్రదేశాలకు తీసుకెళ్ళి తవ్వకాలు కూడా జరిపించారు. భీమా తీసుకెళ్ళిన ప్రతీ చోటా ప్రత్యేక దర్యాప్తు బృందం చీఫ్ ప్రణబ్ మొహంతి నేతృత్వంలోని అధికారులు తనిఖీలు చేశారు. అయితే ఒక్క చోట తప్ప మరెక్కడా మృతదేహాలు దొరకలేదు. దాంతో పాటూ ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. భీమా దెబ్బకే సిట్ అధికారులకు తల తిరిగింది. ఇప్పుడు అతనికి తోడు.. ధర్మస్థల అంశం తెరపైకి వచ్చిన తర్వాత తన కుమార్తె మిస్ అయిందంటూ వచ్చిన సుజాత కూడా ఇప్పుడు మాట మార్చింది.సుజాతా భట్ అనే మహిళ ఇటీవల దక్షిణ కన్నడ పోలీసులను ఆశ్రయించారు. 2003లో తన కుమార్తె అనన్య భట్ స్నేహితులతో కలిసి ధర్మస్థలకు వచ్చి కనిపించకుండా పోయిందని ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై పోలీసులు దర్యాప్తు చేపట్టిన తరుణంలోనే, శుక్రవారం(ఆగస్టు 22) ఆమె తాను చెప్పిందంతా కట్టుకథేనని చెప్పింది. ఈ కట్టుకథ చెప్పడానికి గల కారణాన్ని కూడా సుజాత వివరించారు. "అనన్య భట్ పేరుతో తనకు కుమార్తె లేదు. ఆ ఫొటోలు కూడా సృష్టించినవే. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇద్దరు ప్రముఖులు తనతో ఈ అబద్ధం చెప్పించారు" అని ఆమె వెల్లడించారు.ధర్మస్థలలో వందల మృతదేహాలను పూడ్చిపెట్టానని గతంలో భీమా అనే పారిశుద్ధ్య కార్మికుడు ఆరోపించాడు. ఇప్పటి వరకూ తానే ప్రత్యక్ష సాక్షి అంటూ వచ్చిన భీమా మాట మార్చారు. తనకు ఒకరు పుర్రె ఇచ్చి సిట్ అధికారులకు ఇవ్వమన్నారని, న్యాయస్థానంలో పిటిషన్ కూడా వారే వేయించారని చెప్పడంతో ఈ కేసు దర్యాప్తు అధికారులకు సవాలుగా మారింది. ఇప్పుడు సుజాతా భట్ యూటర్న్‌తో ఈ వ్యవహారం మరింత ఉత్కంఠ రేపుతోంది.దీంతో, తప్పుడు సమాచారం ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించారన్న కారణంతో అతడిని అదుపులోకి తీసుకున్నట్టు సిట్ అధికారులు తెలిపారు. ఈ అరెస్ట్‌తో ధర్మస్థల కేసు అనూహ్య మలుపు తీసుకుంది.

## 2035 నాటికి భారత్‌కు సొంత అంతరిక్ష కేంద్రం



**న్యూఢిల్లీ:** భారతదేశం అంతరిక్ష రంగంలో కొత్త పుంతలు తొక్కుతున్నదని, 2035 నాటికి భారతదేశానికి సొంత అంతరిక్ష కేంద్రం, భారతీయ అంతరిక్ష స్టేషన్ ఏర్పాటవుతుందని ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ పేర్కొన్నారు. ఆగస్ట్ 23 జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నారాయణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 2040 నాటికి భారతదేశ అంతరిక్ష కార్యక్రమం ప్రపంచంలోని ఇతర అంతరిక్ష కార్యక్రమాలకు సమానంగా ఉంటుందని నారాయణన్ అన్నారు. ప్రధాని మోదీ అందించిన దిశ, దార్శనికతల ఆధారంగా చంద్రయాన్–4 మిషన్ మనకు సాకారమయ్యింది. వీనస్ ఆర్బిటర్ మిషన్‌కు కూడా చేరువయ్యాం. 2035 నాటికి మనకు అంతరిక్ష కేంద్రం ఏర్పాటు కానుంది. ప్రధాని నెక్స్ట్ జనరేషన్ లాంచర్ కు ఆమోదం తెలిపారని ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ పేర్కొన్నారు.

## భారత్ కీలక నిర్ణయం..
## ఆగస్ట్ 25 నుంచి అమెరికాకు పోస్టల్ సేవలు నిలిపివేత



**న్యూఢిల్లీ:** భారత్ కీలక నిర్ణయం తీసుకున్నది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఆగస్ట్ 25 నుంచి అమెరికాకు పోస్టల్ సేవలు నిలిపివేయనున్నది. ఈ మేరకు తపాలా శాఖ శనివారం ప్రకటించింది. అమెరికా సుంకాలకు సంబంధించిన మార్పులు ఈ నెల చివరి నుంచి అమలులోకి రానున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 25 నుంచి ఆ దేశానికి పోస్టల్ కన్సైన్‌మెంట్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పోస్టల్ డిపార్ట్‌మెంట్ శనివారం వెల్లడించింది. కాగా, అమెరికా విధించిన టారిఫ్ డ్యూటీ కలెక్షన్ ప్రక్రియపై ఇంకా స్పష్టత రాలేదు. దీంతో ఆగస్ట్ 25 తర్వాత అమెరికాకు పోస్టల్ పార్శిల్స్‌ను తీసుకెళ్లబోమని పలు విమానయాన సంస్థలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో దీనికి అనుగుణంగా ఆగస్ట్ 25 నుంచి వంద డాలర్ల వరకు విలువైన లేఖలు, పత్రాలు, బహుమతి వస్తువులు మినహా మిగతా అన్ని రకాల వస్తువుల బుకింగ్స్‌ను నిలిపివేస్తున్నట్లు పోస్టల్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. మరోవైపు ఇప్పటికే పార్శిల్‌లను బుక్ చేసుకున్న, పంపలేని కస్టమర్లు రీఫండ్ క్లెయిమ్ చేసుకోవచ్చని పోస్టల్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. 'కస్టమర్లకు కలిగిన అసౌకర్యానికి తపాలా శాఖ తీవ్రంగా చింతిస్తోంది, వీలైనంత త్వరగా అమెరికాకు పూర్తి సేవలను తిరిగి ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని అధికారిక ప్రకటనలో పేర్కొంది.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ రైడ్స్..
## నోట్ల కట్టలు.. నగల గుట్టలు



కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే కేసీ వీరేంద్రను ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) శనివారం అరెస్ట్ చేసింది. అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ రాకెట్ నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై గ్యాంగ్‌టక్‌లో ఆయన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. వీరేంద్ర పలు అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు నడుపుతున్నట్లు ఈడీ గుర్తించింది. ఆయన సోదరుడు కేసీ తిప్పేస్వామి దుబాయ్‌లో మూడు సంస్థలు ద్వారా గేమింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తేలింది. గ్యాంగ్‌టాక్‌లో కాసినో స్థలాన్ని లీజుకు తీసుకునే ప్రయత్నంలో ఉన్న సమయంలో వీరేంద్రను అరెస్ట్ చేశారు. ఈ బెట్టింగ్ రాకెట్ కార్యకలాపాలు దుబాయ్ కేంద్రంగా సాగుతున్నట్లు ఈడీ ప్రాథమికంగా గుర్తించింది. ఈ అరెస్టు క్రమంలో ముందుగా దేశవ్యాప్తంగా వీరేంద్రకు సంబంధించిన 30 ప్రాంతాల్లో ఈడీ ఏకకాలంలో దాడులు జరిపింది. 22, 23(శుక్ర, శని) తేదీల్లో సిక్కిం, కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్ర, గోవాతో సహా పలు రాష్ట్రాల్లో ఈ దాడులు జరిగాయి. గోవాలోని ఐదు ప్రముఖ కాసినోలపై కూడా దాడులు జరిగాయి. ఈ సోదాల్లో లెక్కల్లో చూపని భారీ మొత్తంలో నగదు, బంగారం బయటపడ్డాయి. ఈడీ సోదాల్లో గుట్టలు గుట్టలుగా నోట్ల కట్టలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. తనిఖీల్లో సుమారు రూ. 12 కోట్ల నగదు, రూ. 6 కోట్ల విలువైన గోల్డ్ ఆభరణాలు, 10 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన నగదులో దాదాపు కోటి రూపాయల విలువైన విదేశీ కరెన్సీని కూడా ఈడీ స్వాధీనం చేసుకుంది. నాలుగు ఖరీదైన వాహనాలను సీజ్ చేయడంతో పాటు వీరేంద్రకు చెందిన 17 బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. రెండు బ్యాంక్ లాకర్లను కూడా తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు ఈడీ పేర్కొంది.

## 'ఇప్పుడు రక్తం, క్రికెట్ కలిసి ప్రవహిస్తున్నాయా'..
## ప్రధాని మోదీకి సంజయ్ రౌత్ ఘాటు లేఖ

ఆసియా కప్ లో భాగంగా భారత్ పాకిస్థాన్ దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ అనుమతి ఇవ్వడంపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ తీవ్రంగా స్పందించారు. పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడాలన్న నిర్ణయం దేశ ప్రజలకు బాధ కలిగించే అంశమని, ఇది అమానుష చర్య అని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి ఆయన ఒక లేఖ రాశారు. 'పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన భారతీయుల రక్తం ఇంకా ఆరనేలేదు. వారి కుటుంబాల కన్నీళ్లు ఇంకిపోనేలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడటం మానవత్వం లేని చర్య' అని సంజయ్ రౌత్ తన లేఖలో పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడటం మన సైనికుల పరాక్రమాన్ని అవమానించడమే కాకుండా, కశ్మీర్ కోసం ప్రాణత్యాగం చేసిన శ్యామప్రసాద్ ముఖర్జీతో సహా ప్రతి అమరవీరుడిని అగౌరవపరచడమే అవుతుందని ఆయన విమర్శించారు. ప్రధాన మంత్రి, హోంమంత్రిత్వ శాఖ అనుమతి లేకుండా క్రీడా మంత్రిత్వ శాఖ ఇంత పెద్ద నిర్ణయం తీసుకోలేదని సంజయ్ రౌత్ తన లేఖలో పేర్కొన్నారు. దేశభక్తి కలిగిన పౌరుల మనోభావాలనే తాను ఈ లేఖలో వ్యక్తపరుస్తున్నానని తెలిపారు. భారత్–పాకిస్థాన్ మ్యాచ్‌లు దుబాయ్‌లో జరుగుతున్నాయని, ఒకవేళ మహారాష్ట్రలో జరిగి ఉంటే బాలాసాహెబ్ ఠాక్రే శివసేన వాటిని అడ్డుకుని ఉండేదని అన్నారు. కేంద్రం హిందుత్వం, దేశభక్తి కంటే పాకిస్థాన్‌తో క్రికెట్‌కే ప్రాధాన్యం ఇస్తూ దేశ ప్రజల మనోభావాలను కాలరాస్తున్నదని మండిపడ్డారు. కేంద్రం నిర్ణయాన్ని శివసేన (యూబీటీ) తీవ్రంగా ఖండిస్తోందని రౌత్ స్పష్టం చేశారు.

# తెలుగు సెంటిమెంట్ పండుతుందా?



-మొదటిపేజీ తరువాయి

ఆరోపణలకు బలం చేకూర్చినట్లవుతుందన్నది వారి భయం కావచ్చు. అలాగని బీజేపీ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతిస్తే బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసిపోయాయన్న కాంగ్రెస్ ప్రచారానికి బలం చేకూరినట్టు అవుతుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు ఉన్న నాలుగు ఓట్లు ఎవరికి పడతాయన్నది ఆసక్తికరంగా మారింది. తటస్థంగా ఉండే అవకాశం ఉంది. పీవీ నరసింహారావు నంద్యాల నుంచి లోక్‌సభకు పోటీ చేసినప్పుడు టీడీపీ ఆయనకు మద్దతిచ్చిన మాట వాస్తవమే కానీ.. తరువాతి కాలంలో పీవీ తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు టీడీపీని చీల్చి ఏడుగురు ఎంపీలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. పైగా... పీవీ ప్రధానిగా ఉండగా.. ఆ తరువాత కూడా కాంగ్రెస్ పార్టీ ఆయనకు తగిన గౌరవం ఇవ్వలేదన్న విషయాన్ని బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇప్పుడు ఎత్తి చూపుతున్నాయి. పీవీ మరణాంతరం ఆయన భౌతిక కాయాన్ని ఏఐసీసీ ఆఫీస్ ఆవరణలోకి అనుమతించలేదని ఆ పార్టీలు వ్యాఖ్యానిస్తున్నాయి. వీటికి కాంగ్రెస్ సమాధానం ఇచ్చే పరిస్థితి లేదు. ఇంకో విషయం. ప్రముఖ నేత నీలం సంజీవరెడ్డి తొలిసారి కాంగ్రెస్ అధికారిక అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి పోటీ చేసినప్పుడు ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ పార్టీ నిర్ణయాన్ని కాదని స్వతంత్ర అభ్యర్థి వీవీ గిరికి మద్దతిచ్చారు. అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ నీలం సంజీవరెడ్డికి కాకుండా వీవీ గిరికి మద్దతిచ్చింది. ఆ సమయంలో కాసు బ్రహ్మానందరెడ్డి సీఎంగా ఉన్నారు. అప్పుడు కూడా తెలుగు సెంటిమెంట్ పట్టించుకోలేదన్నమాట. నీలం సంజీవరెడ్డి రెండోసారి జనతా పార్టీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా రాష్ట్రపతి పదవికి ఎన్నికయ్యారు. తెలుగువాడైన వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతి పదవికి పోటీ చేసినప్పుడు తెలంగాణ కాంగ్రెస్ సపోర్టు చేసిందా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. అప్పట్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ గోపాలకృష్ణ గాంధీని బలపరిచింది.

ఇక ఏపీ విషయాన్ని చూస్తే రెండు సభలలో కలిపి తెలుగుదేశం కు 17 మంది ఎంపీల బలం ఉంది. జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. బీజేపీకి ఆరుగురు సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌కు 11 మంది ఎంపీలున్నారు. తమకు మద్దతివ్వాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాద్ సింగ్ వైసీపీ అధ్యక్షుడు జగన్ ను కోరారు. రాజ్యాంగ పదవులకు ఎన్నిక జరిగినప్పుడు అనుసరించడానికి జగన్ ఒక పద్ధతి పెట్టుకున్నారు. ఆ ప్రకారమే ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇక టీడీపీ, జనసేనలు ఎన్డీయేలోనే ఉన్నందున అవి సుదర్శనరెడ్డికి ఓటు వేసే పరిస్థితి లేదు. చంద్రబాబుకు, రేవంత్ రెడ్డి కు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ రాజకీయంగా ఉప రాష్ట్రపతి ఎన్నికలో కాంగ్రెస్ కూటమికి టీడీపీ మద్దతు ఇవ్వలేదు. కాకపోతే జస్టిస్ సుదర్శనరెడ్డి తనకు చంద్రబాబుతో ఉన్న సంబంధాల గురించి వ్యాఖ్యానించిన తీరు ఆసక్తికరంగా ఉంది. చంద్రబాబుతో ప్రత్యేక అనుబంధం ఉందని కాని, సంబంధం లేదని కానీ చెప్పలేనని ఆయన అంటున్నారు. 1995లో ఎన్టీఆర్, చంద్రబాబుల మధ్య జరిగిన న్యాయ పోరాటానికి సంబంధించి తీర్పు ఇచ్చిన బెంచ్‌లో తాను కూడా సభ్యుడనని ఆయన వెల్లడించారు. చంద్రబాబు మంచి, చెడు బేరీజు వేసుకోవచ్చని, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయన సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నానని ఆయన అన్నారు. సుదర్శనరెడ్డి వ్యూహాత్మకంగా మాట్లాడినా చంద్రబాబు ఇప్పటికిప్పుడు ఎన్డీయేను కాదనే పరిస్థితి లేదు. కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఒక ప్రకటన చేస్తూ సుదర్శనరెడ్డికి మద్దతు ఇచ్చి తన కృతజ్ఞత తెలుపుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ చంద్రబాబుపై ఆశలు పెంచుకుంటున్నట్లుగా ఉంది. బీహారు శాసనసభ ఎన్నికలలో బీజేపీ కూటమి ఓడిపోతే, కేంద్రంలో మోడీ ప్రభుత్వం పడిపోయే అవకాశం ఉందని, చంద్రబాబు ఎన్డీయే నుంచి బయటకు వస్తారని కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు అల్కా లాంబా జోస్యం చెప్పారు. భవిష్యత్తులో ఏమి జరుగుతుందో చెప్పలేం కాని చంద్రబాబుతో కాంగ్రెస్‌కు ఉన్న రహస్య సంబంధాలను ఆమె తెలియచేసినట్లుగా ఉంది. రేవంత్ రెడ్డి ద్వారా రాహుల్ గాంధీతో చంద్రబాబు హాట్ లైన్ పెట్టుకున్నారని ఇప్పటికే మాజీ సీఎం జగన్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. తెలంగాణ వరకు చూస్తే లోక్ సభలో కాంగ్రెస్‌కు ఎనిమిది, రాజ్యసభలో ముగ్గురు సభ్యులు ఉన్నారు. బీజేపీకి 8 మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారు. ఎంఐఎంకు ఒకటి, బీఆర్ఎస్‌కు నాలుగు రాజ్యసభ స్థానాలూ ఉన్నాయి. ఈ రకంగా చూస్తే సుదర్శనరెడ్డికి కేవలం ఈ 12 మంది మద్దతు మాత్రమే లభించే పరిస్థితి ఉంది. కాగా తెలుగు సెంటిమెంట్‌ను రేవంత్ రెడ్డి వాడితే, బీజేపీ కూటమి తమిళ సెంటిమెంట్ వాడే అవకాశం ఉంటుంది. అక్కడ మెజార్టీ స్థానాలు డీఎంకే పార్టీకి ఉన్నాయి. కాంగ్రెస్, డీఎంకేలు ఒకే కూటమిలో ఉన్నాయి. అక్కడ బీజేపీ పక్షాన ఒక్క ఎంపీ కూడా లేరు. అన్నాడీఎంకేకు మాత్రం ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఉన్నారు. మిగిలిన వారు డీఎంకే, కాంగ్రెస్ కూటమికి చెందినవారే. అయినప్పటికీ తమిళనాడుకు చెందిన బీజేపీ నేతను ఉప రాష్ట్రపతి పదవికి పోటీలో దించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ ఈ ఎంపిక చేసి ఉండవచ్చు. పోటీచేస్తున్న రాధాకృష్ణన్ తన సొంత రాష్ట్రమైన తమిళనాడులో, సుదర్శనరెడ్డి తెలుగు రాష్ట్రాల నుంచి మెజార్టీ మద్దతు పొందలేరన్నమాట. కాగా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పదే,పదే ప్రస్తావిస్తున్న కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి రెడ్డి అగ్రవర్ణాలకు చెందిన ప్రముఖుడిని అభ్యర్థిగా ఎలా పెడతారని బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రశ్నిస్తున్నాయి. సుదర్శనరెడ్డి గెలిస్తే బీసీ రిజర్వేషన్లకు కేంద్రంలో ఆమోదం తెలిపే అవకాశం ఉంటుందని రేవంత్ రెడ్డి అంటున్నారు. ఇది కూడా మోకాలికి, బోడు గుండుకు ముడిపెట్టడమే. కాగా ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్ బీసీ వర్గానికి చెందినవారని బీజేపీ ప్రచారం చేస్తోంది. అందువల్ల కాంగ్రెస్ బీసీ కార్డు ఈ సందర్భంగా పనిచేసే అవకాశం ఉండదు. మొత్తం మీద జస్టిస్ సుదర్శనరెడ్డిని ఎంపిక చేయడం ద్వారా కాంగ్రెస్ లో రేవంత్ రెడ్డి తన పరపతి పెంచుకునే అవకాశం ఉంది. అంతకు తప్ప ఆయన ప్రయోగించిన తెలుగు సెంటిమెంట్ కాని, బిసి రిజర్వేషన్ ల వాదన కాని ఫలించే పరిస్థితి కనిపించడం లేదు.

# జగన్ జైలు రన్.. కొంత మందికే పరామర్శ

**విజయవాడ :** అధికారం పోయిన తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా వివిధ కేసుల్లో జైలుకు వెళు న్నారు. వల్లభనేని వంశీ నుంచి కాకాణి గోవర్ధన్ రెడ్డి వరకూ చాలా మంది నేతలు జైళ్లకు వెళ్లారు. వారందర్నీ జగన్ ఆయా జైళ్లకు వెళ్లి పరామర్శించారు. పోసాని వంటి కొంత మందిని పరామర్శించలేదు. అదే సమయంలో లిక్కర్ స్కామ్ లో అరెస్టయిన వారెవర్నీ పరామర్శించలేదు. ఈ కేసులో అరెస్టు అయిన వారందరూ జగన్‌కు అత్యంత సన్నిహితులే. మిథున్ రెడ్డి .. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఆయనకు లిక్కర్ కేసుతో ఏం సంబంధం లేదని జగన్ పలుమార్లు ప్రెస్మీట్లలో చెప్పారు. అయితే సుప్రీం కోర్టులోనూ ఊరట లభించకపోవడంతో చివరికి రాజంపేట ఎంపీ అరెస్టు కావాల్సి వచ్చింది. కానీ జగన్మోహన్ రెడ్డి ఇప్పటి వరకూ ఆయనను పరామర్శించలేదు. ఇరవై ఐదో తేదీన జగన్ .. మిథున్ రెడ్డిని పరామర్శించేందుకు రాజమండ్రి వస్తారని బొత్స సత్యనారాయణ ప్రకటించారు. కానీ ఒక్క రోజులోనే ఆ ప్రోగ్రాం క్యాన్సిల్ అయినట్లుగా బొత్స ప్రకటించారు. ఇక జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా పని చేసిన రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిలను కూడా జగన్ పరామర్శించలేదు. వారిద్దరూ జగన్ కు అత్యంత సన్నిహితులు. ధనుంజయ్ రెడ్డి.. జగన్ సీఎంగా ఉన్న ఐదు సంవత్సరాల పాటు సీఎంవోలో చక్రం తిప్పారని అంటారు. అన్ని పనులు ఆయన చేతుల మీదుగానే జరిగేవని చెబుతారు. అలాంటి ధనుంజయ్ రెడ్డి అరెస్టు అయినా జగన్.. జైలుకు వెళ్లి పరామర్శించలేదు. కృష్ణమోహన్ రెడ్డి కూడా జగన్‌కు సన్నిహితులే. వీరిని కూడా ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. లిక్కర్ కేసులో జగన్మోహన్ రెడ్డి పేరు కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. సిట్ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌లో జగన్ ప్రస్తావన ఉంది. అసలు ఈ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్దిదారుడు జగన్మోహన్ రెడ్డేనని సిట్ చెబుతోంది. ఇలాంటి సమయంలో లిక్కర్ కేసు నిందితుల్ని పరామర్శించకపోవడం వెనుక ప్రత్యేక వ్యూహం



ఉందంటున్నారు. వారిని పరామర్శిస్తే అందరూ కలిసి ప్లాన్ చేశారని.. అందుకే వారి కోసం జైలుకు వచ్చారని ప్రచారం జరిగే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. లాయర్లు, న్యాయనిపుణుల సూచనల మేరకే జగన్.. తనకు అత్యంత ఆత్మీయులు అయినప్పటికీ లిక్కర్ కేసు నిందితుల్ని జైలుకు వెళ్లి పరామర్శించడం లేదని చెబుతున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం జగన్మోహన్ రెడ్డి అందర్నీ బలి చేసి తాను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు.

**కోటరీ నుంచి బయటకు ఎప్పుడు**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయి పదమూడు నెలలు కావస్తుంది. ఈ పదమూడు నెలల్లో పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు ఏమైనా తీసుకున్నారంటే ఏమీ లేదనే చెప్పాలి. ప్రభుత్వ నిర్ణయాలు, హామీలు అమలు చేయకపోవడంపై నిరసనలు వ్యక్తం చేయడం మినహా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలు ఏమైనా ఉన్నాయా? అంటే శూన్యమే అని చెప్పాలి. వైసీపీ అధినేత వైఎస్ జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి నెలలో రెండు సార్లు రావడం అందుబాటులో ఉన్న నేతలతో సమావేశం కావడం మినహా మరే రకమైన కార్యక్రమాలను చేపట్టలేదు. ఇక రైతుల సమస్యలపై జిల్లాలకు వెళ్లి వారి బాగోగులను తెలుసుకోవడం, అక్రమ కేసుల్లో ఇరుక్కున్న పార్టీ నేతలను పరామర్శించడం వంటి వాటితో సరిపెట్టేశారు. ఇక ఓటమిచెందిన తొలి నాళ్లలో ముఖ్య కార్యకర్తలతో జగన్ ముఖాముఖి అని హడావిడి చేసినా ఒకటి రెండు జిల్లాలతోనే సరిపెట్టేశారు. అందులోనూ స్థానికసంస్థల ప్రతినిధులు అధికార పార్టీకి వెళ్లకుండా ఉండేందుకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశాలు పెట్టి పార్టీలో కొనసాగితే రాజకీయ భవిష్యత్ ఉంటుందని భరోసా ఇచ్చారు. నిజానికి 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలయిన తర్వాత చంద్రబాబు ఊరికే కూర్చోలేదు. జిల్లాలను పర్యటించారు. నేరుగా జిల్లాలకే వెళ్లిన చంద్రబాబు నేతలు,కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇప్పుడు ఓటమి భవిష్యత్ విజయానికి నాంది అని చెప్పి క్యాడర్ లో ధైర్యం నింపడంలో నాడు చంద్రబాబునాయుడు సక్సెస్ అయ్యారు. కానీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఎలా ఉన్నారో.. కోల్పోయినప్పుడు కూడా అదే స్థాయిలో తాడేపల్లి పార్టీ కార్యాలయాన్ని వీడటం లేదు. పాదయాత్ర చేస్తారనని అంటున్నాఅందుకు చాలా సమయం ఉంది. కానీ అంతకంటే ముందుగా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించాలి. జిల్లా కేంద్రాల్లో అన్ని నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తలు,నేతలను పిలిచి మాట్లాడాలి. వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేసిన తప్పులను వారి నుంచి తెలుసుకోవాలి. ఓపిగ్గా వినాలి. మరొకసారి అధికారంలోకి వస్తే అలాంటి తప్పులు దొర్లవన్నహామీ వారికి అక్కడే ఇవ్వగలిగాలి. అంతేకాని అధికారంలో ఉన్నప్పటి లాగానే కోటరీ మధ్య చిక్కుకుంటే పరిస్థితుల్లో మార్పు రాదన్న విషయం జగన్ గుర్తించాలన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. మరి నేను ఉన్నాను.. నేను విన్నానంటూ జనం మధ్య నాడు వెళ్లినట్లే ఇప్పుడు క్యాడర్ మధ్యకు వైసీపీ చీఫ్ వెళ్లాల్సి ఉంది.

## హెచ్చరికలతో సరా

**విజయవాడ:** మధ్యకాలంలో టీడీపీ అధినేత ఏపీ సీఎం చంద్రబాబు చాలా ఎక్కువగా వాడుతున్న పదం నేను "95 నాటి చంద్రబాబుని.. ఎవరి అలసత్వాన్ని ఉపేక్షించను "అని. కానీ జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అప్పటి స్ట్రిక్ట్ చంద్రబాబు మళ్లీ కనబడడం కష్టమేనా అని అనుమానాలు వస్తున్నాయి. వరుస పెట్టి పార్టీ నాయకులు వివాదాల్లో చిక్కుకుంటున్నా కొంతమంది హద్దు దాటి ప్రవర్తిస్తున్నా చంద్రబాబు హెచ్చరికలు వరకు మాత్రమే పరిమితం అయిపోతున్నారా అన్న చర్చ పార్టీ వర్గాల్లో సైతం మొదలైంది. ఈ ఒక్క నెలలోనే టిడిపి నాయకులు నాలుగు పెద్ద వివాదాల్లో చిక్కుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమా రిలీజ్ అవుతుంటే ఆ సినిమాను ఆడనివ్వం అంటూ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్ ప్రసాద్ హెచ్చరిస్తున్నట్టుగా ఉన్న ఆడియో రిలీజ్ అయింది. అందులో వాడిన దుర్భాషలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల్ని తీవ్రంగా బాధపెట్టాయి. దానితో వాళ్ళు నిరసనలకి దిగారు. ఆడియో తనది కాదని ఎమ్మెల్యే ఎంత చెప్పినా చాలామంది అది ఆయనదే అని నమ్ముతున్నారు. చంద్రబాబు సైతం ఎమ్మెల్యేని పిలిపించి మందలించారు. కానీ ఇప్పటికీ ఆ వివాదం చల్లబడలేదు. నెల్లూరు అరుణ విషయం పార్టీ ఇమేజ్‌ను బాగా దెబ్బతీసింది. ఆమె సన్నిహితుడు యావజ్జీవ ఖైదీ శ్రీకాంత్‌కి పెరోల్ లభించేలా ఇద్దరు టిడిపి ఎమ్మెల్యేలు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అది అటు ఇటు తిరిగి ఏకంగా హోంశాఖకు అంటుకుంది. ప్రస్తుతం శ్రీకాంత్ తిరిగి జైలుకు వెళ్లిపోగా అరుణ కూడా అరెస్టు అయింది. దీనిపై హోంమంత్రి స్వయంగా మీడియాకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తమను వేధిస్తున్నాడు అంటూ ఒక మహిళ మీడియా ముందుకు వచ్చారు. అసభ్యకరమైన వేధింపులు ఎదుర్కొన్నామని ఆరోపణలు చేశారు. దీని ఎమ్మెల్యే స్పందిస్తూ తనపై జరిగిన కుట్రగా ఖండించారు. ఇవన్నీ కూడా ఇండైరెక్టుగానో లేక ఆడియోలపరం గానో నేతలు వివాదాల్లో చిక్కుకున్నవి. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్ని పరిధిలూ దాటేశారు. విధుల్లో ఉన్న అటవీ సిబ్బందిపై తన అనుచరులతోపాటు దాడి చేసినట్టున్న విజువల్స్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిలో అటవీశాఖ డైరెక్ట్ గా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతిలో ఉంది. దీనితో ఆయన సీరియస్ అయ్యారు. మరోవైపు సీఎం చంద్రబాబు కూడా ఎవరిని వదిలిపెట్టొద్దంటూ పోలీసులను ఆదేశించడంతో ఎమ్మెల్యేపై కేసు నమోదైంది. ఈ నాలుగు వివాదాలు ఒక్క నెలలోనే బయటపడడం అనేది ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఉన్న అధికార పార్టీ ఎమ్మెల్యేలలో కొంతమంది ఎంత లెక్క చేయకుండా ప్రవర్తిస్తున్నారో అన్న నిజాన్ని బయటపెట్టింది. ఇలాంటి వివాదాలు వరుస పెట్టి బయటపడుతున్నా "చంద్రబాబు మండిపడ్డారు

## ఏపీ ఆర్థిక పరిస్థితిపై వైఎస్ జగన్ ఆందోళన

**తాడేపల్లి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళ వ్యక్తం చేశారు. ప్రధానంగా ఆదాయాలు తగ్గిపోయి, అప్పులు పెరిగిపోవడంపై వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాగ్ నివేదికలను ఉటంకిస్తూ వైఎస్ జగన్ తన సోషల్ మీడియా అకౌంట్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. 'రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు భారీగా తగ్గి, అప్పులు పెరిగి పోతున్నాయి. కూటమి ప్రభుత్వ విధానాలతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2019%-%24 మధ్య మా ప్రభుత్వంపై టీడీపీ, జనసేన పార్టీలు పదేపదే అబద్దాలు చెప్పాయి. రాష్ట్రంలో ఆదాయ వృద్ధి తగ్గిందనీ, అభివృద్ధి అనేదే లేదని తప్పుడు ప్రచారం చేశాయి. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామంటూ కూటమి నేతలు నమ్మబలికారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆదాయాలు భారీగా తగ్గాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయాలు కేవలం 3.08% మాత్రమే పెరిగాయి. కేంద్ర ప్రభుత్వ ఆదాయాల వృద్ధి 12.04% పెరగగా, ఏపీ ఆదాయం భారీగా తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టు నిజంగానే ఏపీ ఆర్థిక వృద్ధి 12.02% ఉంటే, మరి ఆదాయం పెరుగుదల 3.08% దగ్గరే ఎందుకు ఆగిపోయింది?, గతేడాదితో పోల్చితే ఈఏడాది కొంత ఆశాజనకంగా ఉంటుందనుకుంటే మొదటి నాలుగు నెలల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది.

**బాబు సర్కార్ అప్పులు.. కాగ్ నివేదికపై వైఎస్ జగన్ రియాక్షన్**

ప్రజల్లో కొనుగోలు శక్తి కూడా బాగా తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆదాయాల వృద్ధి పది శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 2.39% మాత్రమే ఉంది. మా హయాంలో అన్ని రకాల అప్పులు కలిపి రూ.3,32,671 కోట్లు మాత్రమే. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ 14 నెలల్లోనే ఏకంగా రూ. 1,86,361 కోట్లు అప్పు చేసింది. అంటే మా ఐదేళ్ల హయాంలో చేసిన అప్పుల్లో ఇప్పటికే 56% చేశారు. ఆదాయాలు తగ్గి, అప్పులు పెరిగిపోతున్న ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలి. అన్ని స్థాయిల్లో పెరిగిన అవినీతిని అరికట్టాలి' అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ప్రమాద బీమా రూ. కోటి

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. ఈ కొత్త ఆర్థిక సదుపాయం ద్వారా మున్సిపల్ కార్మికులకు గణనీయమైన భరోసా లభించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 123 అర్బన్ లోకల్ బాడీస్‌లో మొత్తం 55,686 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. ఇప్పుడు ఈ స్కీం ద్వారా వీరందరికీ ఈ బీమా సదుపాయం లభించనుంది. వీరిలో 39,170 మంది పబ్లిక్ హెల్త్ విభాగంలో ఉండగా, 16,516 మంది ఇతర విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరిలో శాశ్వత, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న వారందరికీ ఈ పథకం వర్తించనుంది. ఇప్పటి వరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరణించిన సందర్భాల్లో కుటుంబీకులకు ఎక్స్%-%గ్రేషియా రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తోంది. ప్రమాద మరణానికి రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ. 2 లక్షలు ఇచ్చే విధానం అమలులో ఉంది. ఇప్పుడు ఆక్సిస్ బ్యాంక్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ద్వారా ఈ ప్రయోజనాలు మరింత విస్తరించాయి. శాశ్వత ఉద్యోగులకు ఒక రూ. 1 కోటి వరకు ప్రమాద బీమా, పది లక్షల లైఫ్ కవర్ లభించనుంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇరవై లక్షల ప్రమాద బీమా, రెండు లక్షల లైఫ్ కవర్ సదుపాయం ఉంటుంది. అంతేకాకుండా ప్రమాద మరణం జరిగితే పిల్లల చదువు కోసం గరిష్టంగా రూ. 8 లక్షల వరకు విద్యా సహాయం అందించనుంది. దీంతో పాటు తక్కువ ప్రీమియం ద్వారా ఆరోగ్య బీమా అందుబాటులో ఉంది. కుటుంబ సభ్యులతో కలిపి మొత్తంగా రూ. 33 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ఇదే కాకుండా మున్సిపల్ కార్మికుల కుటుంబ సభ్యులు మరో జీరో బ్యాలెన్స్ అకౌంట్ తెరిస్తే వారికి రూ. 15 లక్షల మేర ప్రమాద బీమా కూడా అందుబాటులోకి వస్తుంది. ఈ పథకం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మున్సిపల్ కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఇప్పటిదాకా ఓ లెక్క.. ఇప్పటినుంచి మరో లెక్క

-మొదటిపేజీ తరువాయి

మా బకాయిలు చూపించాలి. నాలుగు డీఎలు పెండింగ్‌లో ఉన్నాయి. డీఏ, ఐఆర్ కోల్పోవడం, బకాయిలు ఇవ్వకపోవడంతో వేల కోట్లు నష్టపోయాం. మా హక్కును మేం అడుగుతున్నాం. మూడు నెలల్లో బకాయిలు చెల్లించకపోతే పోరుబాట పడతాం" అని బొప్పరాజు చెప్పారు. ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి దామోదర్ మాట్లాడుతూ.. ఉద్యోగి కుటుంబం నుంచి వచ్చానని చెప్పిన పవన్ ఇప్పుడు మాట్లాడటం లేదు. 2023 నుంచి ఐఆర్ రావాలి. వేల కోట్లు బకాయిలు ఉన్నాయి. మా సమస్యలు పరిష్కరించకుంటే ఎటువంటి ఉద్యమాకైన సిద్ధం. ప్రభుత్వ స్థలాలు, ఆర్టీసీ స్థలాలు ప్రైవేట్ వ్యాపారవేత్తలకు అప్పగిస్తే సంపద సృష్టి జరగదు.

# డిసెంబర్‌లో గగన్ యాన్


**నెల్లూరు :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగాన్ని రెడీ అవుతోంది. మరో మైలు రాయిని అధిగమించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. మిషన్ గగన్‌యాన్‌కు సంబంధించి ఇస్రో పెద్ద అప్‌డేట్ ఇచ్చింది. ఈ ఏడాది డిసెంబర్‌లో గగన్‌యాన్-జి1ని ప్రయోగించనున్నట్లు ఇస్రో చీఫ్ వి. నారాయణన్ తెలిపారు. నాలుగు నెలల్లో ఈ రంగంలో అనేక విజయాలు సాధించామని నారాయణన్ అన్నారు. అటువంటి పరిస్థితిలో, ఈ ఏడాది చివరిలో, బహుశా డిసెంబర్‌లో మొదటి మానవరహిత మిషన్ జి1ను ప్రయోగించనున్నారు. అర్ధ-మానవుడిలా కనిపించే వ్యోమిత్ర కూడా అందులో ఎగురుతారని ఆయన అన్నారు. భారత్ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో గగన్‌యాన్ ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు ఇస్రో ఛైర్మన్ ప్రకటించారు. విజయవంతమైన ఆక్సియం-4 మిషన్ నుండి ఇటీవలే తిరిగి వచ్చిన శుభఅన్షు శుక్లా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం అనుభవం భారతదేశ సొంత గగన్‌యాన్ మిషన్‌కు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. గగన్‌యాన్‌కు సంబంధించిన అనేక ప్రయోగాత్మక ప్రయోగాలను చేపట్టి విజయం సాధించింది. అందులో భాగంగానే అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపే దిశలో ఇస్రో మరో అడుగు ముందుకు వేస్తోంది .ఈ నేపథ్యంలోనే గగన్‌యాన్ ఉ1 ప్రయోగాత్మక రాకెట్ ప్రయోగాన్ని 2025 చివరి మాసంలో తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుండి ఉ1 రాకెట్ ప్రయోగాన్ని చేపట్టేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తోంది. అదేవిధంగా ఈ గగన్ యాన్ రాకెట్ ప్రయోగానికి సంబంధించి గగన్‌యాన్ ఉ1, గగన్‌యాన్ ఉ2, గగన్‌యాన్ ఉ3 లాంటి రాకెట్ ప్రయోగాలను కూడా 2026లో చేపట్టేందుకు ఇస్రో ఒక ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. అలాగే 2027 వ సంవత్సరంలో గగన్‌యాన్ భారత్ తొలి మ్యాన్ మిషన్ ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. ఒక రోబోను తయారుచేసి ఈ రాకెట్ ప్రయోగంలో అమర్చి అంతరిక్షంలో పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. అంతరిక్షంలోకి మానవులను పంపే ముందుగా ఈ రోబోను పంపి అక్కడ వివిధ పరిశోధనలు చేసి, ఆ సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందజేస్తుంది. అంతరిక్షంలోకి పంపిన రోబో హిందీ, ఇంగ్లీష్ భాషలలో పరిశోధనలు చేసిన సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందిస్తుంది. అంతరిక్షంలోకి వెళ్ళాక అక్కడ వ్యోమగాములు ఎలాంటి వాతావరణ పరిస్థితులను తట్టుకునే వీలు ఉంటుందన్న అంశాలపై కూడా ఈ రోబో అధ్యయనం చేసి శాస్త్రవేత్తలకు తెలియజేస్తుంది. గగన్‌యాన్ ప్రధాన ప్రయోగానికి ముందుగా అంటే 2027 లో రాకెట్ ప్రయోగంలో రోబోను అమర్చి ప్రయోగాన్ని చేపట్టేందుకు ఇస్రో శ్రీకారం చుట్టింది. మ్యాన్ మిషన్ సక్సెస్ చేయడం అంటే భూమి నుంచి అంతరిక్షంలోకి వాహక నౌక వెళ్లడమే కాదు.. అంతరిక్షంలో పరిశోధనలు పూర్తి చేసుకున్న తర్వాత తిరిగి భూమి మీదకు క్షేమంగా రావడమే ప్రయోగం పూర్తి విజయంగా చూడాల్సి ఉంటుంది. ఇందుకోసమే ఇస్రో పూర్తి స్వదేశీ టెక్నాలజీతో గగన్‌యాన్ మిషన్ చేపడుతున్న సందర్భంలో ప్రతి దశను సొంతంగా ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టి అన్ని రకాలుగా పరీక్షలు చేపడుతోంది. అంతరిక్ష నుంచి భూమికి తిరిగి వచ్చేటప్పుడు వ్యోమగామిలు ప్రయాణించే క్యాప్సిల్ క్షేమంగా భూమి మీదకు తీసుకురావడం కూడా అత్యంత కీలకం.. కాబట్టి ప్రయోగాన్ని చేపట్టి భూమి నుంచి అంతరిక్షంలోకి వెళ్లడం మొదలు పరిశోధన పూర్తయ్యాక తిరిగి భూమి మీదకు క్షేమంగా వచ్చేవరకు అన్ని దశలను ఎప్పటికప్పుడు విజయవంతంగా పరీక్షలు చేపడుతోంది ఇస్రో.

# సంపాదకీయం

## నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత


ప్రతి సంవత్సరం ఆగస్టు 23 నుండి సెప్టెంబర్ 1 వరకు ప్రపంచ నీటి వారోత్సవాలను పాటిస్తారు. నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపరూపమైన పదార్థము. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, తటకములు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది. క్రొత్త క్రొత్త సమ్మేళన పదార్థముల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోను నీరు కలుషిత మౌతున్నది. అలా కలుషితమైన జలము జల చక్రము ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థములను, అనగా రసాయన పదార్థములను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడము, ఆమ్ల వర్షాలు కురవడము సర్వ సాధారణము. దాంతో ప్రకృతికి అపార నష్టము జగురుతున్నది. జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి, ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త దావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవ రసాయనాలు నీటిలో కరుగుతాయి. ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచి నీల్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే. ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది త్రాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా త్రాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే. నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా..నీటిని వృధా చేస్తున్నాం..నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే..మనకు అందుబాటులో ఉన్న నీటిని వృధా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని, ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ (కెమికల్ బాత్), వాటితోనే స్నానాలు చేస్తారనీ..దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాసా పరిస్థితి ఉంటుందని.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. భారత చరిత్రంతా జలవనరుల తోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించు కోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్పన్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటిని వృథా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృథాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వి నియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి.

# కెమెరాకే ట్రిక్కులు నేర్పిన రాజన్‌బాబు



అద్భుతమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, గొప్ప సన్నివేశాలు, అపురూప సంఘటనలు, మనసు దోచే దృశ్యాలు, ఆలోచింప జేసే రూపాలు... అరుదైన చిత్రాలు...వెరసి ఫొటోగ్రఫీ. వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేది ఫొటో. వంద మాటలతో చెప్పలేనిది ఒక్క ఫొటోతో చెప్పడం సాధ్యం. అంతటి శక్తివంతమైనది ఫొటోగ్రఫీ. అలాంటి శక్తిని వశం చేసుకుని ఫొటోతో అద్భుతాలు సృష్టించిన కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు. కెమెరాకే ట్రిక్కులు నేర్పిన నేర్పరి రాజన్ బాబు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాజన్ బాబు తెలంగాణకు చెందిన వారు కావడం గర్వకారణం. బండి రాజన్ బాబు (ఫిబ్రవరి 9, 1939 – ఆగస్టు 24, 2011) ప్రఖ్యాత ఛాయా చిత్రకారులు. దృశ్య ప్రధానమైన ఛాయా గ్రహణంలో పేరు తెచ్చుకొన్న బండి రాజన్ బాబు 1939, ఫిబ్రవరి 9 న కరీంనగర్ జిల్లా కోరుట్లలో జన్మించారు. రాజన్ బాబంటే తొలుత గుర్తుకు వచ్చేవి ఆరకు లోయల్లో తీసిన బొండా గిరిజన మహిళల అగణిత ఛాయా చిత్రాలు. బాల్యంలో రంగులు వేయడం, చిత్రాలను గీయడం పట్ల ఆసక్తిని కనబరిచిన రాజన్ బాబు, మంచి చిత్రకారుడు కావల్సి ఉండగా, కుంచె నుండి కెమెరాకు మారడం యాదృచ్ఛికం. బాల్యం నుంచి చిత్రకళ పై మక్కువ ఉన్న రాజన్, 7వ తరగతి చదువు తున్నపుడు తన కజిన్ బహూకరించిన సాధారణ కొడాక్ 620 కెమెరాతో తీసిన చిత్రాలు పెక్కుమంది ప్రశంసలు అందుకొని రాజన్ లోని ఛాయాగ్రాహకుడిని వెలికి తీసింది. హైదరాబాదులోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో కమర్షియల్ ఆర్ట్ (వ్యాపార చిత్రకళ) లో డిప్లొమా కోర్స్ లో చేరిన సమయంలో, రాజన్ బాబు ప్రఖ్యాత ఛాయాగ్రాహకుడు దివంగత రాజా త్రయంబక్ రాజా బహదూర్ ను కలవటం జరిగింది. రాజా త్రయంబక్ రాజా, రాజన్ బాబును కుంచె స్థానంలో కెమెరా పట్టుకోమన్న సలహా రాజన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 5 సంవత్సరాల డిప్లొమా చేసి, కళాశాలలో డిస్టింక్షన్ లో ఉత్తీర్ణుడయి, కళాశాల యాజమాన్యం మెప్పు పొంది అదే కళాశాలలో అధ్యాపకుడిగా చేరాడు. తరువాత ఇక్రిశాట్ లో సైంటిఫిక్ ఫొటోగ్రాఫర్ గా పనిచేశారు. 1978 లో తన ఫొటో స్టుడియో స్థాపించి, రాజన్ స్కూల్ ఆఫ్ ఫొటోగ్రఫీ ప్రారంభించి ఎందరో విద్యార్థులను నిపుణులైన ఛాయా గ్రాహకులుగా తీర్చిదిద్దాడు. ఛాయాగ్రహణంలో రాజన్ తొక్కిన కొత్త పుంతలు తనకు దేశీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. 1987లో నగ్న చిత్రాలపై ఛాయాచిత్ర కళాకృతులను సమర్పించి రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందాడు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ కార్యదర్శిగా ఉంటూ, భగవాన్ దాస్ తర్వాత లెన్స్ లైట్ అనే ఛాయాగ్రాహక పత్రికకు సంపాదకత్వం వహించారు. డిజిటల్ ఛాయాగ్రహణానికి ముందు ఛాయాచిత్రాలు డార్క్‌రూం (చీకటి గది) లోనే స్థిర రూపం దాల్చేవి. నెగటివ్ లు వృద్ధి చేయటానికి, స్థిరపరచడానికై రాజన్ తానే రూపొందించుకొన్న రసాయనిక సూత్రం పై ద్రవణాలు కలిపి డెవలపర్ తయారు చేసి, నెగటివ్ లను స్థిరపరిచేవారు. ఈ విధానంలో...చిత్రంలో, నలుపు, తెలుపులను ప్రస్ఫుటంగా చూపే హైడ్రొక్వినాన్ లేకుండా కేవలం మెటల్ తోనే ఫిల్మ్ ను వృద్ధిపరచి, స్థిరపరచి, నలుపు తెలుపులో ఎన్నో కళాఖండాలు సృష్టించారు. ఇది రాజన్ ప్రతిభకు నిదర్శనం. ఫొటోషాప్ లాంటి సాఫ్ట్వేర్లు లేని సమయంలో కూడా రాజన్ అద్భుతాలు చేశారు. తన కళా నైపుణ్యంతో తన ఛాయా చిత్రాలను పలు మార్లు వన్ మాన్ షో లో ప్రదర్శించి, పలువురి ప్రశంసలందుకున్నారు. రాజన్ తీసిన నగ్న చిత్రాలలో రసికత ఉంటుంది కాని అసభ్యతకు చోటు ఉండదు. అందుకే అవి రసజ్ఞుల ప్రశంసలు పొందాయి. కొడాక్ 620 తో మొదలుపెట్టిన రాజన్, తన విద్యార్థులకు ఛాయా గ్రహణ పాఠాలలో భాగంగా బోధించ టానికై, చాలా కెమెరాలు సేకరించారు. వాటిలో ఛాయాచిత్ర కారులలో హోదాకు చిహ్నమైన ఖుంంవఠ్రీ×ఠ్రీఖఃఎ-ఎవఃణఋఎ-ఒశీఱమీఫ్ ఖుఎవఱీఖు కూడా ఉంది. ఫిల్మ్ కెమెరా ూయిఙఒఖ్గఱ గ్రవఞ్ఖుఙ నుంచి, ఛాయాగ్రహణం డిజిటల్ దిశగా సాగిన పయనంలో రాజన్ ఖుఒశీఱ 400ణ వాడే వాడు. ఛాయాగ్రహణ శాఖలలో ఒకటైన ఇండస్ట్రియల్ ఫొటోగ్రఫీలో కూడా రాజన్ తన సత్తా చూపారు. నగ్న చిత్రాలకు, అసభ్య చిత్రాలకు మధ్య ఒక గీత ఉంటుంది అనేవారు రాజన్ బాబు. ఛాయాగ్రహణం ఒక భాషైతే, అందులోని వ్యాకరణమే అని వివరించే వారు. ఈ మెళకువ గ్రహించిన వాడు మంచి ఛాయా గ్రాహకుడవుతాడని రాజన్ అంటుండే వారు. పిక్టోరియల్ ఫొటోగ్రఫీలో తనదైన ముద్ర వేసిన రాజన్ బాబు 2011, ఆగస్టు 24 న తన 73వ ఏట, అనారోగ్యంతో, హైదరా బాదులో మరణించారు. రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ వేదికలపై ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేసి, లెక్కకు మించిన అవార్డులు, బహుమతులు సొంతం చేసుకున్న రాజన్ బాబు ఫోటోగ్రఫీ కళా కారునిగా చిరకాలం గుర్తుండి పోతారు.

# సాహితీ వాచస్పతి దాశరథి




తెలుగు జాతి గర్వించదగిన సాహితీవేత్త దాశరథి రంగాచార్య. ఆయన చేసిన బహుముఖ రచనలు అనన్య సామాన్యాలు. అసాధారణ మేథో సంపత్తికి ప్రతిరూపాలు. రంగాచార్య రచనల్లో తెలంగాణదనం నిండుగా పరుచుకొని ఉంటుంది. ప్రగతి శీల భావం ఉప్పొంగుతుంది. వేద విజ్ఞానం ఆధ్యాత్మికతను తట్టి లేపుతుంది. తెలంగాణ గ్రామీణ జన జీవనం సాక్షాత్కారిస్తుంది. అందుకే తెలంగాణ ప్రజలు, పోరాట యోధులు, తీవ్రవాదులు, పీడిత తాడిత ప్రజలు, నిరంకుశ పాలన బాధితులు, చరిత్రకారులు, చివరకు భాగవతోత్తములు... ఒక్కొక్కరికీ ఒక్కొక్క రీతిలో ఆత్మీయ రచయితగా నిలిచారు. ఆయన రచయిత, జీవిత చరిత్రకారుడు మాత్రమే కాదు. తెలుగు, సంస్కృతం, ద్రావిడం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు, కవి, విమర్శకులు, నాటకకర్త. గొప్ప వక్త. ఏ అంశాన్నైనా అలవోకగా అవలీలగా వీనులకు ఇంపుగా చెప్పగలిగిన వ్యాఖ్యాత. తొలితరం ఉద్యమ రచయిత, తెలంగాణ అజ్ఞాత సాయుధ పోరాట యోధుడు. దాశరథి రంగాచార్యులు 1928, ఆగస్టు 24 న నాటి మహబూబా బాదు జిల్లా, చిన్నగూడూర్ మండలం, చిన్నగూడూర్ లో విద్వాన్ వెంకటాచార్య– శ్రీమతి వెంకటమ్మ దంపతులకు జన్మించారు. పుట్టింది పండిత కుటుంబమే అయినా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు దాశరథి. ఆయన అగ్రజుడు దాశరథి కృష్ణమాచార్యుల నుండి అభ్యుదయ, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఇద్దరూ కలిసి పనిచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ ఉద్యమ జీవితాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించారు రంగాచార్య. తెలంగాణ చరిత్ర, ఉద్యమాలు, ప్రజల జీవితం, సాహిత్యం, సంస్కృతి.. ఇలా తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను రచనల్లో స్పృశించిన సాటిలేని మేటి రచయిత ఆయన. ఆయన రచనల్లో పార్శ్యం... మూడు కావ్యేతిహాసాలను %-% శ్రీమద్రామాయణము, శ్రీమదాంధ్ర మహాభారతము, శ్రీమద్భగ వతము, వేదాలు %-% ఋగ్వేదము, కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము ఒకే ఒక్కరుగా సంస్కృతం నుంచి వ్యాఖ్యాన సహితంగా ప్రతిభకృతి చేసిన ఏకైక రచయిత దాశరథి. ఆరవ తరగతి చదువుతున్నప్పుడే తోటి విద్యార్థులను కూడగట్టి నిజాంకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. నిజాం రాజ్యం ఆంధ్రదాష్ట్రం నిలిచి ఉండాలని పాఠశాలల్లో చేసే ప్రార్థన, తాను చేయడానికి రంగాచార్య నిరాకరించి, నిబంధన మేరకు వారి లాగే కుచ్చు రూమీ టోపీ ధరించడానికి తిరస్కరించి బడి నుండి బహిష్కృతులు అయినారు. ఎక్కడా చదువు కాకుండా నిజాం ప్రభుత్వం ఫర్మానా జారీ చేసింది కూడా. పోలీసు నిర్భంధం, చిత్రహింసల నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్లి నిజాం వ్యతిరేక పోరాటం క్రియాశీలంగా జరిపారు. తర్వాత నిజాం ప్రభుత్వం వారంటు జారీ చేసినా, రంగాచార్య జాడ కనుక్కోలేక పోయింది. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్లు రైతు కూలీలకు ఉద్యమ బోధ చేసేవారు. తొలి నవల 'చిల్లరదేవుళ్లు'ను 1969లో వెలువరించారు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు' 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942–48 సంవత్సరాల మధ్య కాలాన్ని 'మోదుగు పూలు' నవల వర్ణిస్తుంది. చిల్లరదేవుళ్లు', 'మోదుగు పూలు' వంటి నవల్లో తెలంగాణ పలుకుబడులను – నుడికారాన్ని పలికించారు. స్వాతంత్య్రం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010 సంవత్సరంలో వెలువరించారు.1994లో హరివంశ సహిత 'మహ భారతం' రచించారు.1940ల్లో కోల్ కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల '%వ ఎవ్వరీ తీఆవం ూ అన్తవతీ%'ను 'దేవుని పేరిట' పేరుతో తెలుగులో అనువదించారు. తొలినాళ్లలో రంగాచార్య పిల్లలకోసం 'వివేకనందుడు', 'మహాత్ముడు', 'కాళిదాసు' అనే మూడు నాటకాలు రచించారు. 1974లో 'శ్రీ వేంకటేశ్వర లీలలు' రచించారు. వేదాలు సామాన్యుడికి సైతం అందించాలనే ఆలోచనతో 70 ఏళ్ల వయస్సులో బృహత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. విస్తృత సాహిత్యాన్ని సరళమైన తెలుగులోకి తేవడం, ముద్రణ, పంపిణీ, వ్యాప్తి కళ్లార చూడడం రంగాచార్య చేసిన శ్రమఫలం, చేసుకున్న అదృష్టం. ఒక జీవితకాలంలో ఇంత చేసినవారు, ఎదిగినవారు మరొకరులేరు. తెలంగాణ జీవితాన్ని లోకానికి తెలియ జెప్పాలనే చారిత్రక దృష్టితో, దృఢ సంకల్పంతో, తెలంగాణ మీద అభిమానంతో, అందమైన శైలిలో రచనా వ్యాసంగాన్ని ఆయన సాగించారు. 1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో చేరి, ఉద్యోగం చేస్తూనే బీఏ, ఎల్ఎల్బీ చేశారు. 32 సంవత్సరాల పాటు పనిచేసి, 1988లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. రంగాచార్య 2015 జూన్ 8వ తేదీన కన్ను మూశారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్డీవో చంద్రమోహన్

**గోపవరం ఆగస్టు 23 (ప్రజా జ్యోతి న్యూస్)** ఈరోజు బద్వేల్లోఆర్డీవో చంద్రమోహన్ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గారి ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర -స్వచ్ఛంధ్ర కార్యక్రమం ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని దిగ్వి విజయం గా రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి మండల కేంద్రంలోనూ ప్రతి పంచాయతీలోనూ ప్రతి ఊరిలోనూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ఎంతో ప్రతిష్టాత్మకంగా కుటమి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, మరియు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ గారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు ఇళ్ళు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మరియు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించడం నగరాలు నివారణాత్మక పరిశుభ్రతపై దృష్టి సారించాలి. కాలువల శుభ్రత, గుంతల మరమ్మత్తు మరియు ప్రజా ప్రదేశాలలో



పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి అనే ఆలోచనతో తో ఈ రోజు ఉదయం 9:00 గం.లకు బద్వేల్ మునిసిపాలిటీ లో కోటవీధిలోని జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్ నుండి నాలుగుర రోడ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది .బద్వేల్ రెవిన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్ గారి ఆధ్వర్యంలో బద్వేల్ మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి గారి సమన్వయంతో ఈకార్యక్రమంనిర్వహించడంజరిగినది .కార్యక్రమంలో పాల్గొన్న మునిసిపల్ అధికారులు, బద్వేల్ అర్బన్ సీఐ లింగప్ప, బద్వేల్ రూరల్ సీఐకృష్ణయ్య ,ఎస్సైలు రెవిన్యూ అధికారులు , ఆర్ అండ్ బి అధికారులు ,మెడికల్ హెల్త్ ,ఇరిగేషన్, ఐసిడిఎస్ మరియు ఎలక్ట్రిసిటీ అధికారులు, తదితర అన్నీ డిపార్ట్మెంట్ ల ఉద్యోగులు, మెప్మా సిబ్బంది మొదలగు ఇతర డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లింగ వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి:

ఆర్డీవో శ్రీనివాస

**గుంతకల్లు ఆగస్టు 23 (ప్రజా జ్యోతి):** లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని గుంతకల్లు రెవిన్యూ డివిజన్ ఆఫీసర్ (ఆర్డిఓ) శ్రీనివాస్ అన్నారు. శనివారం సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ మరియు సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజర్ కమిటీ పి సి పి ఎన్ డి టి యాక్ట్ 1994 పై రివ్యూ కార్యక్రమము ఆర్డీవో శ్రీనివాస అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో వాలంటరీ ఆర్గనైజేషన్ ఆర్డిటీ వరకుమార్ మరియు మహిళా ప్రగతి సంఘం రాధా,ఈ సబ్ డివిజనల్ లెవెల్ అడ్వైజరీ కమిటీ మెంబర్స్ డాక్టర్ అరుణ, హరిత మరియు రేడియాలజిస్ట్ డాక్టర్ పవన్ కుమార్, డిస్ట్రిక్ మీడియా డెమో సెక్షన్ నుండి డిప్యూటీ హెచ్ ఈ ఓ సత్య నారాయణ మరియు వేణు గోపాల్ ఈ కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్డిఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ లింగ వివక్షతను తగ్గించి ఆడపిల్లల నిష్పత్తిని పెంచాలని,భేటీ పడావో బేటి బచావో,కిశోర వికాస సాధికారత సాధించి మరియు మహిళా సాధికారత సాధించడానికి ఈ లింగ వివక్షత ను రూపు మాపితే సమాజంలో ఈ ఆడవారు యొక్క మహిళా సాధికారత ను సాధించడానికి వీలవు తుంది.ఆడబిడ్డ రక్షించి మహిళల యొక్క సంఖ్యను పెంచుతూ మనం గౌరవించి ఆడబిడ్డ పుట్టిన వెంటనే ఆడ బిడ్డ మగ బిడ్డతో సమానంగా స్వీకరించి ఆడా మగ సమాన మే అని ఒకటేనని ప్రభుత్వము ఆడబిడ్డకు మగ బిడ్డకు సమా న హక్కులు బాధ్యతలు ఇవ్వడం జరిగినందున



ఈ సమాజంలో ఈ రుగ్మత ఈ లింగ వివక్షత రూపుమాపటా నికి ప్రభుత్వం ఈ పీసీపీ ఎంపీ ఆక్ట్ 1994 చట్టాన్ని తీసుకొచ్చింది అందులో భాగంగానే ఈ సబ్ డివిజనల్ అప్రా ప్రేయట్ అథారిటీ కమిటీ మరియు సబ్ డివిజనల్ లెవెల్ అడ్వైజ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో ప్రతి రెండు నెలలకు ఒకసారి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసి మన డివిజనల్ ఈ కార్యక్రమం యొక్క అసలు పనితీరుపై పరిశీలించడం జరిగింది.ముఖ్యంగా ప్రైవేట్ హాస్పిటల్స్ మెడికల్ టర్మినేష న్ ఆఫ్ ప్రెగ్నెన్సీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి ద్వారా పర్మిషన్లు లేని హాస్పిటల్ అబార్షన్ చేయరాదు తీర్మానించడం జరిగినది.అట్లు చేసిన వారిపై ఎంటిపీ యాక్ట్ ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకుంటా రని.గర్భవతులకు చేసే స్కానింగ్ లు,స్కానింగ్ సెంటర్ వారిగా డేటాను తప్పనిసరిగా రికార్డు చేయాలి.లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో,తక్కువగా లింగ నిష్పత్తి ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను గుర్తించి లింగ వివక్షత పై అవగాహన కార్యక్రమాలు రూపొందించి, ప్రజలలో ఈ సామాజిక చైతన్యం తెచ్చి లింగ వివక్షత రూపుమాపడానికి కావాల్సిన టువంటి కార్యక్రమాల్ని రూపొందించి అమలు చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది.

# డివైఎఫ్ఐ సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం

సీమాంక్ హాస్పిటల్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి

**బద్వేల్ ఆగస్టు 23 (ప్రజా జ్యోతి న్యూస్)** భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డా,, బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణమునందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీమాంక్ హాస్పిటల్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, శ్రీ చక్ర హాస్పిటల్ డాక్టర్ చక్రధర్ రెడ్డి,ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా అధ్యక్షులు మాదన విజయ్ కుమార్ గార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివైఎఫ్ఐ నాయకత్వం పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ప్రస్తుతం పచ్చదనం లోపించి పట్టణాలు విస్తరిస్తూ మొక్కలను నరికి వేయడంతో వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల జీవన విధానం ఇబ్బందికరంగా ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తు చేస్తూ, విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే పర్యావరణం, పచ్చదనంపై కేంద్రీకరించి చదువుతున్న పాఠశాలలో, నివాస గృహాలలో మొక్కలు నాటి మన చుట్టూ ఉన్న ప్రాంతాన్ని మంచి ప్రాణవాయువును అందించే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచుటకు కృషి చేయాలని, డివైఎఫ్ఐ నాయకత్వం సమాజ సేవలో భాగస్వామ్యం అయ్యి పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని రానున్న కాలంలో ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలను



చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ యం.లతాదేవి, అధ్యాపకులు శారద, ఖిరున్నేసా, షకీరా,భారతి,లక్ష్మీదేవి,లలిత,చెన్నమ్మ, సీమాంక్ హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్ బ్రహ్మయ్య, సిఐటియు పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్, ముడమాల ఓబుల్ రెడ్డి,నాయకులు యువరాజు, రాజు, ఎస్.కె ఖలీల్, సుధాకర్, పాతిమా పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఐ ఐ ఐ టీ స్టూడెంట్ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

**బద్వేల్ ఆగస్ట్ 23 (ప్రజా జ్యోతి న్యూస్)** ఐ ఐ ఐ టి లో రెండు రోజుల క్రితం నరసింహనాయుడు అనే విద్యార్థి బాత్రూంలో ఉరివేసుకొని చనిపోవడం పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని అఖిల భారత విద్యార్థి అసోసియేషన్ ఏఐఎస్ఎ జిల్లా నాయకులు బి. అనిల్ డిమాండ్ చేశారు శనివారం స్థానిక భగత్ సింగ్ సర్కిల్ దగ్గర జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ లో చదువుతున్న సెకండియర్ విద్యార్థి నరసింహనాయుడు ఉన్నట్టుండి ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకోవడం జరిగింది అని డైరెక్టర్ కుమార స్వామి గుప్తా గారు తెలపడం పై ఎన్నో అనుమానాలు ఉన్నాయని అతని చావుకి కారణం ఒత్తిడి ఏమైనా ఉందా లేకపోతే ర్యాగింగ్ ఇవి టీజింగ్ అంటు ఏమైనా ఉందా అంతకుముందే ఒక నెల క్రితం అక్కడ భోజనంలో పురుగులు రావడం పై అక్కడ చదువుతున్న విద్యార్థులు ధర్నా కూడా చేశారని వాటికి సరైనటువంటి న్యాయం జరిగిందో జరగలేదో అక్కడ ఉన్న యాజమాన్యం ఎక్కడ తెలపలేదని అదేవిధంగా నారాయణ శ్రీ చైతన్య వంటి కార్పొరేట్ స్కూల్లో మరియు కళాశాలలో పదేపదే జరుగుతూ ఉంటాయని ఈ ఆత్మహత్యలకు ఒత్తిడి కారణమైతే ఆ ప్రెషర్ ను తగ్గించడంలో యాజమాన్యం విఫలమైందని దీనిపై ప్రభుత్వం అయిన తగు చర్యలు తీసుకోవాలని అలాగే నరసింహ నాయుడు చావు పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి వారి కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలని వారు అన్నారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ బద్వేలు ఏరియా నాయకులు శివశంకర్ నాయకులు శివ .విష్ణు .వర్ధన్. విజయ్. కుమార్. సాయి. తరుణ్. జైవర్ధన్. రాము . మరో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు




## మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆద్వర్యంలో పలు ఆశ్రమాలల్లో అన్నదాన కార్యక్రమాలు




**సిద్ధవటం ఆగస్టు 23**దసిద్దవటం మండలం మాధవరం-1 గ్రామానికి చెందిన మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్ద సభ్యులు అవ్వారు వెంకట వరప్రసాద్ ఏ.వి.యస్.ఓ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు సతీమణి వెంకట లక్ష్మమ్మ జ్ఞాపకార్థం మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్ద ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యుల సహకారంతో వివేకానంద వృద్దాశ్రమంలో వున్న వృద్దులకు, కొత్త మాధవరం సమీపంలోని కాశినాయన వృద్దాశ్రమంలో వృద్దులకు శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదేవిధంగా కడప ప్రకాష్ నగర్లోని సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయంలోని 105 మంది నిరుపేద, అనాథ, నిరాశ్రయ పిల్లలకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. మరియు ఒంటిమిట్ట కోదండరామస్వామి వారి అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మనఊరికోసం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్, ఉప్పల రామక్రిష్ణ, విష్ణు వర్దన్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## టక్కోలు గ్రామంలో స్వచంద్ర స్వర్ణంద్ర కార్యక్రమం



**సిద్ధవటం ఆగస్టు 23** సిద్ధవటం ఆగస్టు 23 సూర్య ప్రతినిధి స్వచంద్ర స్వర్ణంద్ర కార్యక్రమం టక్కోలు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు ఉపాధ్యాయులు స్వచంద్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మానవహారం (హ్యూమన్ చైన్), ర్యాలీ కార్యక్రమాలుకూడా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్ర మానికిముఖ్యఅతిథిగా పార్లమెంట్ కార్యదర్శి నాగముని రెడ్డి హాజరయ్యారు ఈ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి నాగలింగేశ్వర్ రెడ్డి స్కూల్ హెడ్ మాస్టర్ శ్రీ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలోని చెత్త చెదరని తొలగించిశుభ్రంచేయించారు ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

## ఒంటిమిట్ట కూడలిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర ర్యాలీ




**ఒంటిమిట్ట ఆగస్టు 23** మండల కేంద్రమైన ఒంటిమిట్ట గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకునివారణకు చర్యలు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించవలసినదిగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబులమ్మ జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ జాన్ పర్వీన్ సచివాలయం నుండి ఒంటిమిట్ట దేవాలయ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి పారిశుద్ధ్యం పై అవగాహన కల్పించడం సోలార్ స్క్రీనింగ్ లైట్లు ప్రారంభించి వీధులలో కలిగే తిరుగుతూ డ్రైనేజీ కాలువల యందు పూడిక పనులను కూడా పరిశీలించి ఉన్నారు ఈ కార్యక్రమంలో డివిజనల్పం చాయతీ అధికారి విజయభాస్కర్ ఆర్ రమణారెడ్డి ఎంపీడీవో సుజాత తాసిల్దార్ దామోదర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి సుధాకర్ సచివాలయ సిబ్బంది ప్రజలు నాయకులు ముద్దు కృష్ణ రెడ్డి బొబ్బిలి రాయుడు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరుసుట పై విద్యార్థుల కు అవగాహన సదస్సు








**పోదూరు, ఆగస్టు 23,ప్రజాజ్యోతి న్యూస్ (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).**పాలకొల్లు శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం థీమ్ మాన్సూన్ హైజీన్ అనే కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఎస్ వాలంటీర్స్ మరియు ఇతర విద్యార్థిని విద్యార్థులు సిబ్బంది కళాశాలలో ఉన్న వాటర్ ట్యాంక్స్ , రెయిన్ హార్వెస్ట్ పిట్స్ మరియు ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరిచినారు అంతేకాకుండా టీబీ అవగాహన కార్యక్రమాలలో భాగంగా వక్తృత్వ పోటీలను హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ , ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్ కె భద్రాచలం,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం రామకృష్ణ ,డాక్టర్ వి డి వి విజయలక్ష్మి, పి.జోస్న శ్రీ మరియు ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొనినారు.

# కన్యకా పరమేశ్వరి డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం






**గుంతకల్లు ఆగస్టు 23 (ప్రజా జ్యోతి):**స్థానిక కన్యకా పరమేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ప్రభుత్వ మరియు డైరెక్టర్, కళాశాల విద్య వారి ఆదేశానుసారం ప్రతినెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 'మాన్సూన్ హైజీన్' అనే అంశము పై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థు లు తగిన ఆరోగ్య శ్రద్ధ కార్య క్రమాలను పాటిస్తూ రోగాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే కళాశాల స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కోఆర్డినేటర్ అయినా ఎన్.ఎ. అల్తాఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరిస్తూ వారు దైనందిన జీవితంలో శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా జీవించా లని సూచించారు. కార్యక్రమం చివరిలో విద్యార్థులు అధ్యాప కులు కలిసి స్వచ్ఛ ప్రతిజ్ఞను చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్యుఎసి కోఆర్డినేటర్ జమిలాబీబి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణ, పొలిటికల్ సైన్స్ ఇన్చార్జ్ దేవి చైతన్య, గణిత అధ్యాపకులు బి. శివప్రసాద్ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర లో పాల్గొన్న ముప్పిడి

. ఆసుపత్రి పరిసరాలను చూసి అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే





**తాళ్లపూడి,ఆగస్టు23, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం అన్నదే వరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కొవ్వూ రు శాసన సభసభ్యులు ముప్పి డి. వెంకటేశ్వరరావు ఆసుపత్రి పరిసరాలను చూసి డాక్టర్ మరియు సిబ్బందిపై పరిసరాల శుభ్రతపై అసహనం వ్యక్తం చేసి ఎమ్మెల్యే స్వయంగా శ్రమదానం చేసి కొంతమేర పిచ్చి మొక్కల ను గడ్డిని తొలగించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లా డుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్ర మాన్ని చేపడుతున్నట్లు తెలిపా రు. ప్రస్తుతం వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు ప్రబలకుం డా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గ్రామ పరిధిలో రోడ్ల పక్కన చెత్త కుప్పలు లేకుండా చేసి డ్రైనేజీలను ఎప్పటిక ప్పుడు శుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారులనున ఆదేశించారు. అలాగే పరి శుభ్రమైన త్రాగునీరు ప్రజలకు అందించాలని అన్నారు. ఆసు పత్రి ఆవరణలో ఎమ్మెల్యే స్వయం గా పలు మొక్కలను నాటారు. ఇందు లో భాగంగానే ఉత్తమ సేవలకు గాను అవార్డు లు అందుకున్న తాళ్లపూడి ఎస్సై. టి. రామకృష్ణను, అన్న దేవరపేట పి హెచ్ సి డాక్టర్ ను కూటమి నాయకులతో కలిసి సాలువ తో సత్కరించి అభినం దించారు. అదే విధంగా నియో జకవర్గంలో ఉన్న పీహెచ్సీలపై దృష్టి పెట్టి బిల్డింగ్ మరమ్మత్తు లు, ఆసుపత్రి ఆవరణలో పరి శుభ్రత, రోగులకు కావలసిన సదుపాయాలను ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షులు జి.వి. ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ చెవ్వూ రి. బంగార్రాజు, పైడిమెట్ట ఎత్తిపోతల అధ్యక్షులు ముళ్ళ పూడి. రామచంద్రం ,కాకర్ల. సత్యేంద్ర, కూచిపూడి. గణపతి, చెవ్వూరి.రాము,కైగాల శ్రీనివాస్, కాకర్ల. శ్రీనివాస్ , కొప్పాక జవహర్ ,బిజెపి మండల అధ్యక్షుడు ఇందుగల. రామకృష్ణ, మరియు వివిధ శాఖల అధికారులు కూటమి నాయ కులు పాల్గొన్నారు

# స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం

మానవహారం, ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించిన ఎంపీడీవో, ఎంఈఓ, సెక్రటరీలు




**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా ఎంపీడీవో ఉషారాణి సెక్రటరీలు సుదర్శన్ రెడ్డి ,రజనీష్ రెడ్డి, వేణు మూడవ శనివారం లో భాగంగా లక్కిరెడ్డిపల్లె, మద్దిరేవుల గ్రామ పంచాయతీలో ఈడిగపల్లె నెహ్రు నగర్ నందు స్వచంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహణలో పాల్గొన్నారు. మద్దిరేవుల, లక్కిరెడ్డి పల్లె పంచాయతీ లలో వర్షాకాలం లో వచ్చే అంటువ్యాధులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వారు గ్రామస్థులకు అవగాహన కల్పించడం జరిగింది. మద్దిరేవుల గ్రామ%శీ%లో గ్రామ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, లక్కిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్ అహల్య పారిశుద్ధ్య కార్మికుల చే అక్కడక్కగా నీటినిల్వ ఉన్న వర్షపు నీటిని, బురదను తొలగించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలలో క్లాప్ మిత్రాల చే బ్లీచింగ్ చల్లించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది, సెక్రటరీలు రజనీష్ రెడ్డి, వేణు డిజిటల్ అసిస్టెంట్ జిలాన్ భాష,మహిళా పోలీస్ నందిని, వెటర్నరీ అసిస్టెంట్ జోన ఏఎన్ఎం విజయ కుమారి, అగ్రికల్ అసిస్టెంట్ మల్లికార్జున, వెల్ఫేర్ అసిస్టెంట్ హరిప్రసాద్, ఆశ వర్కర్ కళావతి, అంగన్వాడి వర్కర్ గంట లక్ష్మీదేవి,క్లాప్ మిత్ర చంద్ర,వెంకటరమణ టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షుడు పక్కీరయ్య, అడ్వకేట్ వంశీకృష్ణ, గంట నాగార్జున కట్టమీద గణేష్, జానకి రెడ్డయ్య, జానకి ఆంజనేయులు, గంటా వెంకటకృష్ణ, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమంలో ఇంచార్జ్ యనముల మదన్ మోహన్.



**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలోని ఉచిత కుట్ట (టైలరింగ్ )శిక్షణ కేంద్రాన్ని లక్కిరెడ్డిపల్లి మండల ఇంచార్జ్ యనమల మదన్ మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అక్కా చెల్లెమ్మ లు ఆర్థికంగా బలోపేతం ఆయెందుకు ఉచిత కుట్టు మిషన్ (టైలరింగ్ )శిక్షణ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ సహకారంతో చేపట్టిందన్నారు. శిక్షణ తీసుకున్నటువంటి మహిళలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేటందుకు కృషి చేస్తుందని ప్రతి ఒక్కరూ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ కాలంలో 75% క్లాసులకు హాజరు అవ్వాలని శిక్షణనతారం ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరఫున కుట్టు మిషన్లు అందేలా చర్యలు తీసుకుంటామని వాళ్లకి ఎలాంటి సమస్యలు ఉన్నా రాష్ట్ర రవాణా,యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి మరియు వారి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రయినర్ కాంతమ్మ తో పాటు సర్పంచు లక్ష్మీనారాయణ, కావలి ఆంజనేయులు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కొలిమి పకీరయ్య, ఏ టు జెడ్ విశ్వం, ఓబులేసు, బోనాల దన, రవిశంకర్ రాయల్, ఆర్కే హేమంత్, వెంకటరమణ మొదలైనవారు పాల్గొన్నారు .

## శ్రీ విజేత లో ఆంధ్రకేసరి టంగుటూరి జయంతి



**తాళ్లపూడి,ఆగస్టు 23, ప్రజాజ్యోతి న్యూస్** ఆంధ్ర రాష్ట్రతొలిముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని తాళ్లపూడి లోని శ్రీ విజేత హై స్కూల్ నందు నిర్వహించారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా జొన్నకూటి ప్రమోద్ ఆధ్వ ర్యంలో విద్యార్థులు ప్రకాశం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రకాశం జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. తెల్లవాడి తుపాకీ కి గుండెలు చూపి దమ్ముంటే నన్ను కాల్చండి రా..అంటూ గర్జించి తెలుగు వాడి ధైర్య సాహసాన్ని చాటిన మహోన్నత వ్యక్తి ప్రకాశం అని తెలిపారు. కార్యక్రమంలో పాఠ శాల అకడమిక్ ఇంచార్జ్ కె.కరుణ, ఉపాధ్యాయులు ఆలీ, విజయ్, కరిష్మా, గంగా రత్నం, సలోమి, మేరీ కిరణ్మ యి, చంద్రిక, విద్యార్థులు పాల్గొన్నారు

## బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు



**తాళ్లపూడి,ఆగస్టు23,ప్రజాజ్యోతి న్యూస్** విశ్వ బంధుత్వం దినోత్సవం సందర్భంగా సమాజ సేవా విభాగం బ్రహ్మ కుమారిస్ ఆధ్వర్యంలో తాళ్లపూడి శ్రీ సాయి స్ఫూర్తి ఆసుపత్రిలో సీఈఓ గూడా విజయరాజు, లింగంపల్లి సుధీర్ కుమార్ సమక్షంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా తాళ్లపూడి ఎస్సై. టి. రామకృష్ణ హాజరై రక్తదాన శిబిరాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తం దానం చేయడం వలన ఒకరి ప్రాణాలను నిలబట్టిగలిగే వారమవుతామని ప్రతి ఒక్కరు రక్తదానానికి ముందుకు రావా లని కోరారు.రాజయోగి దాది ప్రకాష్ మణి జయంతి సంద ర్భంగా ఇలాంటి శిబిరాలను అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని అలాగే తాళ్లపూడి లో కూడా నిర్వహించడం జరిగిందని ఆ సంస్థ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రక్త దాతలు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాపు రామచందర్ రెడ్డి



**గుంతకల్లు ఆగస్టు 23 (ప్రజా జ్యోతి):** ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గా నియమితులై శనివారం మొదటిసారిగా కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దర్శనానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్ర రెడ్డి కి బిజెపి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు కొలిమి రామాంజనేయులు మరియు స్థానిక బిజెపి ముఖ్య నాయకులు వారికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. అనంతరం వేద పండితుల సమక్షంలో స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కొలిమి రామాంజనేయులు,సీనియర్ నాయకులు పసుపుల హరిహరనాథ,సీనియర్ నాయకుడు గుర్రం సూర్య నారాయణ ,మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు విజయ లక్ష్మి,పట్టణ అధ్యక్షులు వడ్డే రమేష్,దాసరి శ్రీనివాసులు, బజరంగ్దళ్ కసాపురం రవి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచి గొట్టుముక్కల పౌలు ఇకలేరు

పౌలు మృతి తీరని లోటు

గుమ్మలూరు సర్పంచి సోనియారాణి మావయ్య

ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం



**ప్రజాజ్యోతి (జిల్లా స్టాఫ్ రిపోర్టర్) న్యూస్ పోడూరు, ఆగస్టు -23 :** పోడూరు మండలం గుమ్మలూరు మాజీ సర్పంచి, ప్రస్తుత సర్పంచి గొట్టుముక్కల సోనియా రాణి మామ గొట్టుముక్కల పౌలు వృద్ధాప్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన సర్పంచిగా గ్రామంలోనే కాక పరిసర గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆయన పలువురు నాయకులు, ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శనివారం కుటుంబ సభ్యులు ప్రముఖులు, గ్రామస్తుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. పోడూరు జడ్పిటిసి సభ్యుడు గుంటూరు పెద్దిరాజు, మండల పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లి నాగన్న ఎంపీటీసీ సభ్యులు అంబటి సుధాకర్, సీడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, ఆచంట నియోజకవర్గం క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు విప్పర్తి ప్రభాకర్, కుడిపూడి లక్ష్మణస్వామి, సుంకర సీతారాం, కోట వెంకటేశ్వర్లు తదితరులు వీరి మృతి పట్ల సంతాపం తెలియజేసి ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఆయన మృతి తీరని లోటు అని పలువురు వ్యాఖ్యానించారు. పెద్ద కుమారుడు గొట్టుముక్కల శ్యామ్సన్, సర్పంచి సోనియారాణి, రమేష్, సురేష్, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వం లో ప్రజా సమస్యలకే పెద్దపీట.

ఇంచార్జ్ యనమల మదన్ మోహన్

**లక్కిరెడ్డిపల్లె ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)** ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదిని లక్కిరెడ్డిపల్లి మండల ఇన్చార్జ్ యనుమల మదన్ మోహన్ తెలిపారు. రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు వారి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి సూచనల మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విని అధికారులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకు వస్తే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే మండలంలోని అనేక అభివృద్ధి పనులు జరిగాయని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు మంత్రి మరి వారి సోదరులు సహకారంతో అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యనమల మదన్మోహన్ తో పాటు హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటరామరాజు, క్లస్టర్ కో కన్వీనర్ బోనాల దన, సర్పంచ్ లక్ష్మీనారాయణ ,మల్లి, గన్మెన్ రాజు,దండే శ్రీను, సయ్యద్ మసూద్,డీలర్ అన్వర్, బాబు, సయ్యద్ రిజ్వాన్, రామకృష్ణ, అమ్మద్ అలీ, మోడల్ స్కూల్ చైర్మన్ ఏ టు జెడ్ విశ్వం, కావలి ఆంజనేయులు, రాష్ట్ర ముదిరాజ్ సాధికారిక కమిటీ సభ్యుడు మండ్ల రామాంజనేయులు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కొలిమి పకీరయ్య,కత్తి వేణు, గురుస్వామి సోడి వెంకటేశ్వర యాదవ్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



# కలెక్టర్ వెంకట మురళి నేతృత్వంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో ముందడుగు వేసిన బాపట్ల జిల్లా

**బాపట్ల ఆగస్టు 23 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజలందరూ స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ జె, వెంకట మురళి పిలుపునిచ్చారు. శనివారం బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. కలెక్టరేట్ 57 ఎకరాల ప్రాంగణంలో శుభ్రత పనులను ప్రారంభించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా పరిశుభ్రతా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న సంస్థలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, హాస్టళ్లు, ఆరోగ్య కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందజేయనున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామ రెడ్డి, ఎక్సైజ్ శాఖఇ. ఎస్ వెంకటేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్రావు, జిల్లా ప్రణాళిక అధికారి షాలోమ్ రాజు, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తాసిల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.



# ఒంగోలులో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలు జయప్రదం చెయ్యండి

**రాష్ట్రంలో సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి**

**గుంతకల్లు నుంచి సిపిఐ రాష్ట్ర మహాసభలకు బయలుదేరిన సిపిఐ ప్రతినిధుల బృందం**

**గుంతకల్లు ఆగస్టు 23 (ప్రజా జ్యోతి):**ఒంగోలులో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలకు శనివారం గుంతకల్లు నుంచి సిపిఐ ప్రతినిధుల బృందం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు ఎం వీరభద్ర స్వామి మాట్లాడుతూ ప్రస్తుతం దేశం ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మతోన్మాద అజెండా తో ముందుకుపోతోందని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్యానికి పాతర వేస్తుందని మండిపడ్డారు. దొంగ ఓట్లు, దొంగ నోట్ల రాజ్యం ప్రస్తుతం దేశంలో నడుస్తోంద ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశ ప్రజలకు ఆయుధంగా ఇచ్చిన ఓటు హక్కును రద్దు చేస్తున్నారన్నారు. దొంగ ఓట్ల వ్యవహారంపై దేశమంతా చర్చ జరుగుతుంటే ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబు, పవన్, జగన్లు దీనిపై స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా విస్తృతంగా చర్చ జరుగుతుందని, కానీ చర్చ లేని రాష్ట్రంగా ఏపీ నిలిచిందని ఎద్దేవాచేశారు. దొంగ ఓట్లపై స్పందించకుండా పులివెందు లలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని విమర్శిం చారు.జాతీయ ఎన్నికల కమీషన్ కూడా బీజేపీతో లాలూచీ పడిందని, సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంటే గాని ఓటర్ లిస్టు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అతి పెద్ద ప్రజా స్వామ్య దేశంగా ఉన్న భారత దేశంలో ప్రజాస్వామ్యం నిలబ డాలంటే అర్హులకు ఓటుహక్కు ఉండాలని స్పష్టం చేశారు. చంద్రబాబు, జగన్లకు ప్రజా స్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, ఇద్దరూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పాతర వేశారని విమర్శించా రు. ప్రతిపక్షంలో ఉండగా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారని, అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని అన్నారు. ఈ పదకొండేళ్ల పాలనలో మోదీ ఏ ఒక్క హామీని నెరవే ర్చలేదని, రైతాంగాన్ని గాలికి వదిలేశారని, ధరలు నియం త్రించలేదని, పేదరికాన్ని పోగొట్టలేదని, ఉద్యోగ కల్పన చేయలేదని, నల్లధనం వెనక్కి తేలేదని చెప్పారు. మోదీ పాలనలో అంబానీ, అదాని వంటి కార్పొరేట్ వర్గాలు, పెట్టుబడిదారులు ప్రపంచ కుబేరులుగా ఎదిగారని దుయ్యబట్టారు. మోదీ రాష్ట్రానికి చేసింది కూడా ఏమి లేదన్నారు. సంవత్సర కాలం లో 21 సార్లు ఢిల్లీ వెళ్లిన చంద్ర బాబు ఏమి సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంవత్సర కాలంలో రూ.1.75 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన పోరాడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూపర్-6 హామీలన్ని ఖచ్చితంగా అమలు చేయా ల్సిందేనని డిమాండ్ చేశారు. నూతన బస్సులు కొనుగోలు చేయకుండా, తగిన సిబ్బంది నియామకం జరుగకుండా మహిళలకు ఉచిత బస్సు పథకం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు, అదేవి ధంగా ఆడబిడ్డ నిధి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ.1500లు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు కూడా అమలు జరపాలని డిమాండ్ చేశారు, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని తాము చేస్తున్న పోరాటాన్ని కొనసాగి స్తామని చెప్పారు. ఒంగోల్లో ఈనెల 23 24 25 తేదీలలో జరుగుతున్న భారత కమ్యూని స్టు పార్టీ సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చా రు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్. గోపీనా థ్ సిపిఐ రూరల్ కార్యదర్శి రాము రాయల్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు బి మహేష్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ పట్టణ కార్యవర్గ, సమితి సభ్యులు మల్లయ్యచిదంబరం, నబి,రామలింగ తదితరులు పాల్గొన్నారు.



# తెలుగుదేశం పార్టీ కి ఎల్లప్పుడు ముస్లిం మైనారిటీలు అండగా ఉన్నారు

:పామిడి ముస్లిం సోదరులు...

**ప్రజా జ్యోతి రిపోర్టర్ మధు పామిడి...** ఈరోజు గుంతకల్లు నియోజకవర్గం పామిడి పట్టణ టిడిపి కార్యాలయం నందు ఇటీవల గుత్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన కొట్ట మాలిక్ భాషా గారికి పదవి ఇచ్చినందుకుగాను గుంతకల్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గుమ్మనూరు జయరాం గారికి మరియు ఆయన తనయుడు యువనేత పామిడి మరియు గుత్తి ఇన్చార్జ్ శ్రీ గుమ్మనూరు ఈశ్వర్ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ పామిడి పట్టణ మరియు మండలం ముస్లిం మైనార్టీ సోదరులు ప్రెస్ మీట్ నిర్వహించడం,ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎప్పుడు తెలుగుదేశం పార్టీకి ముస్లిం సోదరులు అండగా ఉన్నారని అదేవిధంగా మన గుంతకల్లు నియోజకవర్గం లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా అన్ని కులాల వారికి అన్ని మతాల వారికి సమాన న్యాయం చేస్తానని చెప్పడం జరిగింది ఇచ్చిన మాట ప్రకారమే ఈరోజు మా ముస్లిం సోదరుడైనటువంటి కొట్టం మాలిక్ భాషా గారికి గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పదవి కట్ట పెట్టినందుకు జీవితాంతం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గారికి మరియు గుమ్మనూరు ఈశ్వర్ గారికి రుణపడి ఉంటామని కచ్చితంగా రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా ఇచ్చిన అన్ని స్థానాల్లోనూ మనఅభ్యర్థులను గెలిపించుకొని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గారికి కానుక ఇస్తామని అన్ని పార్టీలు కలిపి కూటమి పవర్ ఏంటో చూపిస్తామని కూడా పామిడి ముస్లిం మైనార్టీ సోదరులు తెలపడం జరిగింది.. ఈ కార్యక్రమం లో పామిడి పట్టణ మరియు మండల ముస్లిం మైనారిటీ సోదరులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..



## ఆంధ్ర కేసరి స్ఫూర్తి యువతకు ఆదర్శం బాపట్లలో జయంతి వేడుకలు




**బాపట్ల ఆగస్టు 23 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు నేటి తరానికి మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాల్లో జరిగిన 153వ జయంతి వేడుకల్లో కలెక్టర్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మలు చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించి నివాళులర్పించారు. పేదరికంలో పెరిగి న్యాయవాదిగా ఎదిగిన ప్రకాశం పంతులు ఆ వృత్తిని వదిలి స్వాతంత్ర ఉద్యమంలో పాలుపంచుకుని బ్రిటిష్ తుపాకులకు ఎదిరించిన ధైర్యశాలి అని, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజలకు విశేష సేవలు అందించారని కలెక్టర్ గుర్తుచేశారు. యువత ఆయన స్ఫూర్తిని అనుసరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్, ఆర్డిఓ గ్లోరియా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## టంగుటూరి ప్రకాశం స్ఫూర్తి ప్రదాత:

తహసిల్దార్ సయ్యద్

ప్రకాశం ఆశయ సాధనకు పాటుపడాలని హితవు



**ప్రజాజ్యోతి (స్టాఫ్ రిపోర్టర్) న్యూస్, పోదూరు, ఆగస్టు 23 :** ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అందరికీ స్ఫూర్తి ప్రదాత అని పోదూరు తహసిల్దార్ సయ్యద్ మౌలాన ఫాజిల్ అన్నారు. పోదూరు తహసిల్దార్ కార్యాలయంలో శనివారం ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ఫాజల్, ఆర్ఐ రాంబాబు, సిబ్బంది ప్రకాశం చిత్రపటానికి పూలమాలలేసిన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా తాసిల్దార్ సయ్యద్ మూలాన ఫాజీలు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆయన ఆదర్శంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## వేప మొక్కల పంపిణీ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి

జి శివ నారాయణ




**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 23 (ప్రజా జ్యోతి)** లక్కిరెడ్డిపల్లి మండల లో చెంచర్లపల్లె గ్రామంలో వేప మొక్కల నాటే కార్యక్రమానికి జిల్లా వ్యవసాయశాఖ జి శివ నారాయణ హాజరు కావడం జరిగింది. సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులు వాటి ప్రాముఖ్యత నానో ఎరువులు జిల్లాలో ప్రతి మండలంలో ప్రకృతి వ్యవసాయం రైతులందరూ చేయాలి భూసారం పెంచుకుంటూ, పొలంలో పచ్చి రొట్టె ఎరువులు నాడీ కంపోస్ట్ , పచ్చని ఆకులతో, ఇంటి వద్దనే ఎరువు తయారు చేసుకునే విధంగా ఏపీ సిఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయం విధానాలు అమలుపరచుకోవాలని. ఒక దేశీ ఆవుతో రెండు ఎకరాల పొలం పండించుకోవచ్చు ఆరోగ్యం బాగుండాలంటే రసాయన ఎరువులు తగ్గించి, సహజ సిద్ధంగా తయారుచేసిన కషాయాలు, ఘన, ద్రవ, జీవ, పంచకవ్య, అమృతాలు వేసుకోవడం మంచిది. చెంచర్ల పల్లెలో రైతులకు వేప మొక్కలు అందించి వ్యవసాయ సిబ్బందితో పాటు వేప మొక్కలు నారడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి ఏ డి ఏ, జయ రాణి, ఎంఈఓ రాజకుమారి, ఆర్.ఎస్.కె, వ్యవసాయ ఏపీ సిఎన్ఎఫ్ దిలీప్ కుమార్ ఎస్ ఎఫ్ ఆర్, ఐ ఎఫ్ ఎఫ్ సి ఓ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేట టిడిపి ఇన్చార్జ్ జగన్మోహన్ రాజుకు పుష్పగుచ్చ ను అందజేసిన సీనియర్ పాత్రికేయుడు



**సిద్ధవటం ఆగస్టు 23** రాజంపేట నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్,శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన లి సీనియర్ పాత్రికేయుడు బత్తిన రామసుబ్బారెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ చముర్తి జగన్మోహన్ రాజు ఇటీవల ఒంటిమిట్టలో జరిగిన జెడ్పిటిసి ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ఆయన చేసిన కృషి అధిష్టానం గుర్తించి ఆయనకు రాజంపేట ఇంచార్జ్ పదవిని అప్పగించడం జరిగిందని తెలుగుదేశం పార్టీకి పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించడం జరిగిందన్నారు

# రైతుల ఉసురు ఈ ప్రభుత్వానికి తగలక మానదు

- రైల్వే గోడౌన్ లో ఎరువులను పరిశీలించేందుకు వెళ్లిన తమ్మినేని - తండ్రి ,తనయులను అడ్డుకున్న పోలీసులు
- పోలీసులకు ,తమ్మినేని కు మధ్య కాసేపు వాగ్వోపవాదం - బలవంతంగా పోలీసు జీపు లోకి తమ్మినేని ఎక్కించిన పోలీసులు
- మొండి పట్టుదలతో జీపు ముందే ధర్నా చేపట్టిన తమ్మినేని - గోడౌన్ లలో ఎరువులను ఏం చేస్తున్నారో చెప్పేంతవంరకు కదిలే ప్రసక్తే లేదన్న తమ్మినేని
- ఎరువుల కొరత తో రైతులు అవస్థలు పడుతున్నారు - రైతుల గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో రైతాంగం చేసిన తప్పేంటి - రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాల్సిన ఎరువులు సకాలంలో అందించకపోవడం దారుణం
- బ్లాక్ మార్కెట్ దందాలకు పాల్పడటం దారుణమైన చర్య - రైతులు రోడ్డెక్కి పరిస్థితులు కూటమి సర్కార్ పాలనా వైఫల్యానికి నిదర్శనం : మాజీ స్పీకర్,వైసిపి రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు తమ్మినేని సీతారాం
- బలవంతంగా తమ్మినేని ను అదుపులోకి తీసుకుని స్వగృహం వద్ద విచిడిపెట్టిన పోలీసులు








**ఆమదాలవలస, ప్రజా జ్యోతి న్యూస్ :** రైతు కంట కన్నీరు కార్చితే, ఆ కన్నీటి ఉసురులో ఉద్దండులైన పాలకులు కొట్టుకుపోయిన చరిత్ర ప్రజాస్వామ్య పాలనలో లిఖించబడి ఉన్నదని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిన ఇప్పటికి, వ్యవసాయ సాగుకు అవసరమయ్యే ఎరువులు కొరత కూటమి ప్రభుత్వంలో కొట్టుకొచ్చినట్లు కనిపిస్తుందని ఆయన అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో రైతాంగం చేసిన తప్పేమిటిని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గలలో రైతాంగానికి రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాల్సిన ఎరువులు కూడా సకాలంలో అందించకపోవడం దారుణం అన్నారు. బహిరంగ మార్కెట్లో కూడా ఎరువుల కొరత సృష్టించి, బ్లాక్ మార్కెట్ దందాలకు పాల్పడటం దారుణమైన చర్య అన్నారు. తన రాజకీయ చరిత్రలో ఇటువంటి దుస్థితి ఎప్పుడు చూడలేదన్నారు. ఎరువులు కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితులు రావడం, కూటమి సర్కార్ పాలనా వైఫల్యానికి నిదర్శనం అన్నారు. నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల సమస్యలపై గతంలో జిల్లా కలెక్టర్ తో పాటు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఇదే విషయమై రెండు మార్లు మీడియా సమావేశం నిర్వహించి రైతుల పడుతున్న బాధలను వివరించడం జరిగిందన్నారు. ఇది ముమ్మాటికీ పాలకుల వైఫల్యమే అని తమ్మినేని మండిపడ్డారు. ఆముదాలవలస నియోజకవర్గంలో ప్రభుత్వం నుండి వస్తున్న ఎరువులును టిడిపి నేతల స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నట్లు అదే విధంగా పక్కదారి పడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అన్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో కనీసం అధికారం యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమన్నారు.

**రైల్వే గోడౌన్ వద్ద కు వెళ్ళేటప్పుడు ఉద్రిక్తత..**

శనివారం ఎరువులు వ్యాగన్ ఆముదాలవలస రైల్వే గూడౌన్ కు చేరుకున్న విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, రైతుల తరపున నిరసన తెలిపేందుకు సిద్ధపడ్డారు. ఇదే సమయంలో సుమారు 100 మంది పోలీసులు తమ్మినేని నివాసానికి చేరుకున్నారు. రైల్వే వ్యాగన్ వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అయినప్పటికీ ద్విచక్ర వాహనంతో రైల్వే గోడౌన్ వద్దకు చేరుకుంటున్న సమయంలో తమ్మినేని పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా వెళ్ళనీయకుండా నిలువరించి పోలీస్ జీప్ లో ఎక్కించి తమ్మినేని ని తన నివాసం వద్దకు పోలీసులు తరలించారు. అనంతరం తన నివాసం వద్ద తమ్మినేని మీడియాతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎరువులను ఆముదాలవలస కేంద్రంగా రైల్వే వ్యాగన్ నుండి సరఫరా చేయటం జరుగుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాలకు, ఎరువుల డీలర్లకు ఇక్కడినుండే సరఫరా జరుగుతున్నప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాతే ఎరువుల కొరత జిల్లాలో నెలకొంది అన్నారు. వైసిపి పాలనలో ఎటువంటి ఎరువులు కొరత ఏర్పడలేదు అన్నారు. రైల్వే గోడౌన్ కు వచ్చిన ఎరువులు పక్కదారి పడుతుంటే, అధికార యంత్రాంగం కూడా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే, రైతాంగానికి అవసరమయ్యే విధంగా ఎరువులు అందించకపోతే 2000 మంది రైతులతో ప్రజా పోరాటానికి సిద్ధమని తమ్మినేని ప్రకటించారు.

# భవిష్యత్ తరాల రక్షణకై బాపట్ల ఏజీ కాలేజీ విద్యార్థుల అవగాహన ర్యాలీ



**బాపట్ల ఆగస్టు 23 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల ఏజీ కాలేజీ పరిసరాలు శనివారం డ్రగ్స్ నిర్మూలన, ప్లాస్టిక్ నిషేధం నినాదాలతో మార్మోగాయి. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కళాశాలలో ప్రత్యేక సదస్సు నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసోసియేట్ డీన్ ప్రసూన రాణి మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తు కావడంతో వారిని డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టణ సీఐ రాంబాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, డ్రగ్స్ వ్యక్తి ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా నాశనం చేస్తాయని హెచ్చరించారు. మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉండడం ద్వారా మాత్రమే శక్తివంతమైన సమాజం నిర్మాణం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలుగుతున్న అపార నష్టం గురించి అవగాహన కల్పించారు. ఒక్కసారి వాడే ప్లాస్టిక్ మన భవిష్యత్ తరాలకు పెద్ద ముప్పు అని, దాన్ని నిరోధించాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు డ్రగ్స్ ప్లాస్టిక్ నిషేధం గురించి సందేశం చేరవేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. రమాదేవి, సంధ్యారాణి, అబ్దుల్ సలాం, విజయ రామారావు, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 25న జరుగు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.




**( ప్రజా జ్యోతి న్యూస్) ఆగస్టు 23** కర్నూలు నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయం నందు ఎస్ఎఫ్ఐ ఛలో కలెక్టరేట్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ.. ఆగస్టు 25న విద్యారంగ సమస్యల పరిష్కారానికై జరుగు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే 14 నెలలు గడుస్తున్న కనీసం విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ విద్యారంగంపై కూటమి ప్రభుత్వం సవిత తల్లి ప్రేమ చూపుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమి కూడా అమలు చేయలేదు ఇందులో భాగంగా జీ.వో నెంబర్ 77 ను వెంటనే రద్దు చేయాలని మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు 3000 రూపాయలకు పెంచి మెరుగైనటువంటి వసతులు అందించాలని. విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలని వాటితోపాటు జిల్లాలో నెలకొన్న సమస్యలపై ఆగస్టు 25 జరగనున్న ఛలో కలెక్టరేట్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యక్షులు శ్రీనివాసులు, అమర్, నగర నాయకులు యోగి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం

**- ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు**




**బాపట్ల ఆగస్టు 23 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం కొత్త నందాయపాలెం గ్రామంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర,స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు, సర్పంచ్ ఆట్ల వెంకటేశ్వరమ్మ అయ్యప్ప రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ, గ్రామాల పరిశుభ్రతకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, మాన్సూన్ హైజీన్‌లో భాగంగా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను నివారించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో నీటి నిల్వలు ఉన్న ప్రదేశాల్లో సచివాలయం ఏఎన్ఎం, ఆశా వర్కర్ల ద్వారా దోమల నియంత్రణ మందులు పిచికారీ చేయించారని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో గ్రామస్తులు చురుకుగా పాల్గొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి రెడ్డి, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు క్యూర్ హాస్పిటల్ లో ఉచిత వైద్య శిబిరం



**కడప , ఆగష్టు 23:-** నగరంలోని నాగరాజు పేట లో ఉన్న క్యూర్ హాస్పిటల్ నందు ఈనెల 24 వ తేదీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఎముకలు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కె.పార్థ సారధి తెలిపారు. శనివారం క్యూర్ హాస్పిటల్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం ఉంటుందని చెప్పారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని ఉచితంగా పరీక్షిస్తామన్నారు .ఎముకలు విరిగిన వారు, కీళ్ల వాతం సమస్య ఉన్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రముఖ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ చంద్రమౌళి విష జ్వరాలు, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్, తలనొప్పి, కామెర్లు తదితర సాధారణ వ్యాధులకు ఉచితంగా పరీక్షించి తగు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఎముకల లవణ సాంద్రత పరీక్ష ఉచితంగా చేస్తామని తెలిపారు. వివరాలకు 9553102102 అనే సెల్ నెంబర్ ను సంప్రదించాలని ఆయన కోరారు

## కండాపు శ్రీనివాస రావు దాతృత్వం

- మహాత్మా జ్యోతి రావు పూలే పాఠశాలలో ఫ్యాన్లు లేక విద్యార్థుల అవస్థలు
- మానవతా దృక్పథంతో ముందుకు వచ్చిన శ్రీనివాస రావు
- తన వంతు సాయంగా రూ. 5000 విలువైన రెండు ఫ్యాన్లు అందజేత



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండల కేంద్రంలో ఉన్న మహాత్మా జ్యోతి రావు పూలే పాఠశాలలో ఫ్యాన్లు లేక ఉక్కపోత తో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల సమస్యను ప్రిన్సిపాల్ బొత్స ప్రసాద్ కండాపు శ్రీనివాస రావు దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. రూ. 5000 రూపాయలు విలువైన రెండు ఫ్యాన్లను తన వంతు సహాయంగా అందజేశారు. దీంతో విద్యార్థులు ,పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## బదిలీ పై వెళ్తున్న పోస్టు మాస్టర్ కు ఘన సన్మానం



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు పోస్టు ఆఫీస్ లో మూడు సంవత్సరాల పాటు పోస్టు మాస్టర్ గా సేవలందించిన శ్రీనివాస రావు శ్రీకాకుళం కు బదిలీ అయ్యారు. ఈ మేరకు సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిబ్బంది వీడ్కోలు పలుకుతూ బదిలీ అయినా కార్యాలయంలో తమ విలువైన సేవలను అందించి మరింత పేరు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది , ఏజెంట్లు పాల్గొన్నారు.

## డీఎస్సీ 2025 స్కూల్ అసిస్టెంట్ మహిళా విభాగంలో మొదటి ర్యాంకు సాధించిన మద్ది శైలజ

**అభినందించిన టిడిపి మండల అధ్యక్షుడు అనపాన రాజశేఖర్ రెడ్డి..**



**మెలియాపుట్టి, ఆగస్టు 23 ప్రజా జ్యోతి న్యూస్..** శ్రీకాకుళం జిల్లా, మెలియాపుట్టి మండలం మారేడు కోట గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మజ్జి వీరన్న, వసు దేవి దంపతుల కుమార్తె మజ్జి. శైలజకు డీఎస్సీ- 2025 తెలుగు స్కూల్ అసిస్టెంట్ పరీక్షలలో శ్రీకాకుళం జిల్లాలో 5వ ర్యాంక్ రాగా, మహిళా కేటగిరిలో మొదటి ర్యాంకు సాధించడం జరిగినది . శైలజ భర్త మద్ది. ఖగేశ్వరరావు మెలియాపుట్టి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులను నిర్వహిస్తున్నారు. శైలజ కు డీఎస్సీ మొదటి ర్యాంకులో ఉత్తీర్ణత సాధించడం పట్ల సంతోషాన్ని వ్యక్తపరుస్తూ తల్లిదండ్రులతో పాటుగా మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనపాన. రాజశేఖర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం :



**పాతపట్నం ఆగస్టు 23 ప్రజా జ్యోతి న్యూస్..** శనివారం నాడు టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో భాగంగా పాతపట్నం టీబీ యూనిట్ సూపర్వైజర్ పొట్నూరు చిరంజీవి, కురిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బలద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద టీబీ ముక్తాభారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిపై అవగాహన కల్పించి, వ్యధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలు వివరించారు. ఈ వ్యాధి కోసం ప్రభుత్వం తరఫున ఉచితంగా టెస్టులు, మందులు, పోషకాహారం కొరకు టీబీ ట్రీట్మెంట్ సమయంలో ఆరు నెలలు 6000 రూపాయలు అందిస్తారు. ఎక్కువగా పోషకాహార లోపం వల్ల టీబీ పేషెంట్లు అవుతున్నారు స్వచ్ఛందంగా ప్రజలు వచ్చి పోషకాహారం అందించాలని కోరారు. టీబీ పేషెంట్లు సరిగా మందులు వాడకపోతే ఆ పేషెంట్ ఎం.డీ.ఆర్ టీబీగా మారే అవకాశం ఉంది. ఫలితంగా గ్రామంలో టీబీ పేషెంట్లు ఎక్కువ అవుతారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఎల్ ఎస్ ఝాన్సీ రాణి, సి హెచ్ ఓ శృజన, ఏఎన్ఎం శాంతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఆశా కార్యకర్తలు, 104 స్టాఫ్, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

# పాతపట్నంలో విజయవంతంగా సాగిన "శ్రీ శక్తి మహాసభ"..



కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పై కృతజ్ఞతగా సుమారు 5000 మంది మహిళలు హాజరు...

సీఎం,డిప్యూటీ సీఎం,ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేసిన మహిళలు..

మహిళల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్న మహిళా సోదరీమణులు..

మహిళలకు ఆత్మవిశ్వాసం కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం ఇచ్చిన స్త్రీ శక్తి పథకం....





**పాతపట్నం ఆగస్టు 23 ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ లో భాగంగా అమలు చేసిన "స్త్రీ శక్తి" ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతం కావడంతో పాతపట్నం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు పై కృతజ్ఞతతో సుమారు 5000 మంది మహిళలు భారీ అభినందన సభను నిర్వహించారు కార్యక్రమంలో ముందుగా ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సభ వేదిక వద్దకు భారీగా చేరుకుని పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించిన తరువాత పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి, ఈ సందర్భంగా సభలో పాల్గొన్న పలువురు మహిళలు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం వల్ల మేము నిజమైన ఆర్థిక సాధికారతను అనుభవిస్తున్నామని, ప్రతిరోజు విద్యార్థులు, ఉద్యోగస్తులు, చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలకు ఉచిత ప్రయాణం వలన కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గి ఆర్థిక స్వావలంబన కలుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు ఇలాంటి చారిత్రక పథకాలను అమలు చేయాలన్న, మహిళలకు ఆర్థిక చేయూత కల్పించాలన్న ఒక్క తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వానికే సాధ్యమని కొనియాడారు అలాగే నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పలువురు సీనియర్ మహిళా ప్రజా ప్రతినిధులను సన్మానం చేసి గౌరవించడం జరిగింది కార్యక్రమంలో ఐదు మండలాలకి చెందిన ఎన్డీఏ కూటమి నాయకులు,తెలుగు మహిళలు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# సంచార జాతుల దినోత్సవానికి వివిధ కులాల, వృత్తుల, నాయకులను ఆహ్వానించిన జిల్లా బిజెపి అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు..





**మెలియాపుట్టి, ఆగస్టు 23 ప్రజాజ్యోతి న్యూస్..** పాతపట్నం నియోజకవర్గం మెలియాపుట్టి గ్రామం, చాపర గ్రామం లో శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఆ గ్రామానికి వెళ్లి అక్కడ నివసిస్తున్న కొన్ని కులాల సంచార జాతుల పెద్దలను, గ్రామస్తులను కలిసి వారికి ఆగస్టు 30వ తారీఖున జరగబోవు " స్ఫూర్తి " కార్యక్రమం( సంచార జాతుల దినోత్సవం ) కరపత్రములు పంపిణీ, వారితో ఒక సమావేశం ఏర్పాటు చేసి,కరపత్రం చదివారు.వారికి సంచార జాతులు కు కేంద్రం ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు, అదేవిధంగా కులవృత్తులు చేసుకోవడానికి బ్యాంకు నుండి లోన్లు కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు గురించి కూడా వివరించారు.తర్వాత వారికి ఈనెల 30వ తేదీన విజయవాడలో జరిగే స్ఫూర్తి కార్యక్రమం సంచార జాతుల దినోత్సవం సభకు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పూర్వ జిల్లా ప్రధానకార్యదర్శి సలాన రాఘవరావు, జిల్లా ఉపాధ్యక్షులు తాడేలా భూపతి,పూర్వ స్టేట్ కౌన్సిల్ మెంబెర్ వంజంగి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నక్క వెంకటరావు, మండల ప్రధాన కార్యదర్శి పోలాకి మురళీకృష్ణ, పాతపట్నం మండల అధ్యక్షులు పడాల షణ్ముఖరావు,మండల ప్రధానకార్యదర్శి బడియాల బాబురావు, లింగాల వెంకటకృష్ణగారు, మాజీ విద్యాశాఖ అధికారి శ్రీధర్, పైల భాస్కరరావు, ఉన్నారు.

# చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలకు కన్నీళ్లే మిగిలాయి

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి..

**పాతపట్నం ఆగస్టు 23 ప్రజా జ్యోతి న్యూస్** చంద్రబాబు పాలనలో పేదల సంక్షేమం పూర్తిగా విస్మరించబడిందని, కేవలం తన, తన కుటుంబ సభ్యుల స్వలాభం కోసమే ఆయన పాటుపడుతున్నారని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎద్దేవా చేశారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టకుండా, తన కొడుకు లోకేష్‌ను రాజకీయంగా నిలబెట్టేందుకే తపిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో మద్యం, ఇసుక వ్యాపారాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, దీని ద్వారా అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారన్నారు."చంద్రబాబు పాలనలో పేదలకు ఏ మాత్రం మేలు జరగలేదు. పేదల సంక్షేమం పూర్తిగా గాలికి వదిలేశారు. అధికార దుర్వినియోగంతో నిరంకుశ పాలన చేస్తున్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయింది, ఎక్కడ చూసినా అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయి. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఇప్పుడు వాటిని చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజల కష్టాలను తీర్చడానికి అనేక చర్యలు తీసుకుంది. ఇప్పుడు ఆ పథకాలను చంద్రబాబు నాయుడు నిర్వీర్యం చేస్తున్నారు. ఇది ప్రజలకు చేస్తున్న ద్రోహం" అని అన్నారు. చివరగా, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ చంద్రబాబు నాయుడే బాధ్యత వహించాలని, ఆయన నిరంకుశ పాలన త్వరలో అంతం అవుతుందని అన్నారు. "ప్రజలు అంతా గమనిస్తున్నారు, వారికి తగిన బుద్ధి చెప్పడానికి సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు."పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మామిడి గోవిందు అక్రమార్జన పై ఉన్న దృష్టి నియోజకవర్గ అభివృద్ధి పై లేదు. ఎంతసేపు మద్యం, ఇసుక వ్యాపారాల్లో సంపాదనలో బిజీగా ఉన్నాడు తప్ప అభివృద్ధి శూన్యం. ఈయన చేసిన అభివృద్ధి అంతా వీధి




వీధికి బెల్టుషాపులు వచ్చాయి. మద్యం ఏరులై పారుతుంది. అక్రమ ఇసుక రవాణా సాగుతూనే ఉంది.

# పోలవరం, గూటాల, కొత్త పట్టిసీమ, పాత పట్టిసీమ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలను తనిఖీ చేసిన...

ఏలూరు జిల్లా సహాయక అధికారి శ్రీనివాస్

**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ ఆగస్టు 23** ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలవరం మండలంలోని పోలవరం,గూటాల, కొత్త పట్టిసీమ, పాత పట్టిసీమ నాలుగు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లను ఏలూరు జిల్లా డి సి ఓ శ్రీనివాస్, జిల్లా విభాగ సహకార అధికారిని సత్యవతి తనిఖీ చేయడం జరిగిందని వ్యవసాయ అధికారి కే రాంబాబు అన్నారు. అనంతరం డిసిఓ పత్రికలతో మాట్లాడుతూ... మండలంలో ఈ నాలుగు సహకార సంఘాలలో కృష్ణారావు పేట సహకార సంఘానికి 218 టన్నుల యూరియ , గూటాల సహకార సంఘంలో 92 టన్నులు యూరియా, కొత్త పట్టిసీమ సహకార సంఘానికి 88 టన్నులు యూరియా, పాత పట్టిసీమ సహకార సంఘానికి 85 టన్నుల యూరియాని గవర్నమెంట్ తరపున అందించడం జరిగిందని ఆయన అన్నారు. పోలవరం మండలం మొత్తం కలిపి 485 టన్నుల యూరియాను సహకార సంఘాల ద్వారా ఇప్పటికే రైతులకు పంపిణీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. అనంతరం జిల్లా అధికారు లు శ్రీనివాస్, సత్యవతి లు గోదాములు పరిశీలించారు, ఏపీఓఎస్ స్టాక్ అలాగే గోడౌన్ స్టాక్ తనిఖీ చేశారు.కృష్ణారావు పేట సొసైటీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్ జిల్లా అధికారిని యూరియా కొరత ఉందని తెలుపగా డి సి ఓ స్పందించి రైతులందరికీ సాధ్యమైనంత వరకు యూరియా కొరత లేకుండా భర్తీ చేస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం అధ్యక్షులు కొణతాల. ప్రసాద్, పాత పట్టిసీమ సొసైటీ అధ్యక్షులు ను నకాని. రాంబాబు, వ్యవసాయ అధికారి కె రాంబాబు, కృష్ణారావుపేట వ్యవసాయ పరపతి సంఘం సెక్రెటరీ దోనేపూడి. దుర్గాప్రసాద్, సేల్స్ మెన్ మాత. అచ్యుతరావు, పోతుల. విశ్వనాథ్,బుద్దాల. సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.






## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డాక్టర్ సలాన శరత్ కుమార్.



**పాతపట్నం ఆగస్టు 23 ప్రజా జ్యోతి న్యూస్** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు మెలియాపుట్టి మండలం చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ డాక్టర్ సలానా శరత్ కుమార్, పీహెచ్ వైద్యురాలు డాక్టర్ పావని డాక్టర్ హేమంత్ లక్ష్మి మెలియాపుట్టి డాక్టర్ గ్రీష్మ ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు..


## స్వామిత్వ సర్వే పనులను శరవేగంగా పూర్తి చేయాలి





**బాపట్ల ఆగస్టు 23 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** స్వామిత్వ సర్వే, పి-4 అమలు, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం వంటి అంశాలపై శనివారం స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డ్రోన్ చిత్రాలను పిపిఎం ఆధారంగా పరిశీలించి ఫిజికల్ సర్వేతో తారతమ్యాలు లేకుండా చూడాలని, సాంకేతిక సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, రేపల్లె, కర్లపాలెం తదితర మండలాల్లో పనితీరు మందగించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, డిఎల్డిఒలు బాధ్యత వహించాలని హెచ్చరించారు. పర్యాటక దినోత్సవాన్ని సూర్యలంక బీచ్‌లో వైభవంగా నిర్వహించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని, పి-4 అమలులో బంగారు కుటుంబాలకు సహాయక చర్యలపై మార్గదర్శకులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఇంచార్జి గంగాధర్ గౌడ్, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడి కనక ప్రసాద్, ఆర్డీవోలు, మండల అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి..



**గణేష్ మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలనాలు చెల్లించనవసరం లేదు.**

**జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, ఐపిఎస్.**

**శ్రీకాకుళం ఆగస్టు 23 ప్రజా జ్యోతి న్యూస్..** నెల 27న జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసుకొనే గణేష్ పందిళ్ళు, మండపాలు ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్లైన్ లో అనుమతులు పొందాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, ఐపిఎస్, తెలిపారు.గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే నిర్వాహకులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానంతో క్లిక్ చేసి, నిర్దేశించిన అనుమతులు పొందాలన్నారు. సింగిల్ విండో విధానంతో ప్రజలు సులభంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమర్జనంకు అనుమతులు పొందవచ్చునని జిల్లా ఎస్పీ తెలిపారు. మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలనాలు చెల్లించనవసరం లేదని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి స్పష్టం చేసారు.గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించు కోవడానికి, ఇప్పటికే పోలీసు శాఖ జారీ చేసిన నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించి పోలీసు శాఖకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి కోరారు.

## యాళ్ల ఏసుబాబు కుటుంబ సభ్యులని పరామర్శించిన మురళీ రాజు



**కాకినాడ ఆగస్టు 23 ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు, ప్రతిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన యాళ్ల ఏసుబాబు అత్తయ్య బోడ రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ కాకినాడ సూర్య గ్లోబల్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. వారి కుటుంబం సభ్యులును పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్సిపి నాయకులు,నరసాపురం పార్లమెంటు పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు వైద్యులను కోరారు.ఈ కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి ఎనిమిది మంది అరెస్ట్



**ప్రజా జ్యోతి తుగ్గలి** జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కడవకుంట్ల గ్రామము సమీపంలో ఉన్న బురుగువాని కొండ వద్ద గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరం పై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, జొన్నగిరి ఎస్సై ఎన్ సి, మల్లికార్జున తెలిపిన వివరాల ప్రకారం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కడమకుంట్ల గ్రామము సమీపంలో ఉన్న బురుగువాని కొండ వద్ద జొన్నగిరి మరియు మదనంతపురం గ్రామాలకు చెందిన మహమ్మద్ ఇంకా ఏడు మంది పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి సుమారు 19,480/ వరకు నగదు డబ్బులు , 8 సెల్ ఫోన్లు, నాలుగు బైకులు సీజ్ చేసి అందరిపై కేసు నమోదు చేయడమైనది, అని ఎస్సై, ఎన్ సి, మల్లికార్జున తెలిపారు,ఎవరైనా జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో పేకాట గాని, మట్కా గాని ఆడినట్లయితే జొన్నగిరి పోలీస్ వారికి సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలకు తెలపడం అయింది. సమాచారం ఇచ్చినటువంటి వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచబడుతుంది. ఈ పేకాట రైడ్ లో పాల్గొన్న జయన్న హెడ్ కానిస్టేబుల్, పోలీసులు శివప్రసాద్, అశోక్, జనార్దన్, రమేష్, సైఫుద్దీన్ లను సీఐ పులిశేఖర్, పత్తికొండ వెంకట రామయ్య గార్లు సిబ్బంది ని అభినందించడమైనది

# శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి వేడుకలు





**రాయచోటి ఆగస్టు 23 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణ శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడు ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి స్వర్గీయ శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారి 153 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మరియు అధ్యాపకులు ప్రకాశం పంతులు గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిగా, గురువుగా, పత్రికా సంపాదికుడిగా, రాజకీయ నాయకుడిగా, ప్రతి సందర్భంలో నమ్మిన సిద్ధాంతానికి నిలబడిన ప్రకాశంలోని పట్టుదల, నిర్భీతి ,నిష్కలంక వ్యక్తిత్వం భావితరాలకు ఆదర్శనీయమని అభిప్రాయపడ్డారు .ఉజ్వల దేశభక్తి, నిరూపమాన త్యాగ గుణం, అలుపెరగని కార్య దీక్ష ప్రకాశం పంతులను మహోన్నతునిగా మలిచాయని, యువతకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి .బాలాజీ , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ అధికారి కే.రెడ్డయ్య వివిధ విభాగాధిపతులు, మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# సుంకులమ్మ ఆలయంలో వేలాది మందికి అన్నదాన కార్యక్రమం

**( ప్రజా జ్యోతి న్యూస్) ఆగస్టు 23** జోన్ నేషనల్ హైవే పక్కన వున్న నాగలాపురం సుంకులమ్మ, యల్లమ్మ వార్ల పవిత్ర ఆలయం పుణ్యక్షేత్రంలో పోలాల అమావాస్య సందర్భంగా ఈ రోజు పాండురంగ స్వామి ఆలయ నిర్వాహకులు శివ జీవైక్య మతాధిపతి ఎల్లప్ప స్వామి మరియూ వైద్యం రామనాయుడు హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరి సింహనాయుడు వైయస్సార్ నేత బషీర్, వెంగళ్ రెడ్డి దర్శించి అక్కడి ఆలయ నిర్వాహకులైన భాష ని శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు, నిరుపేదలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ్యా గురువులు శ్రీ ఎల్లప్ప స్వామి వారు మాట్లాడుతూ ఆలయ నిర్వాహకులు భాషా తాను ముస్లిం అయినప్పటికీ తన చిన్న వయసు నుండే అమ్మవారి సేవలో తరిస్తున్నారని ఆయనను కలవడం ఆనందంగా ఉందని ఆయన అమ్మవారి దయతో ఎంతో మంది ఇతి భాదలు తీరుస్తున్నారని తెలిపారు.ప్రతి మనిషి కూడా అమ్మవారి సేవలో ఉండాలని కోరారు , భక్తితోనే ఏదైనా సాధ్యమని దైవ కృపతోనే ఎవరైనా జీవితంలో ఉన్నత శిఖరాలకు రాగలరని తెలిపారు. అందువలన ప్రతి ఒక్కరూ క్షణం కూడా సమయం వృధా చేసుకోకుండా దైవ నామస్మరణ లో ఉండాలని ఈ సందర్భంగా అందరినీ ఆయన కోరారు.



# స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న...







ఏపీ ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ ఆగస్టు 23** పోలవరం మండలం గ్రామ పంచాయతీ సర్పంచ్ పోడుం పుష్ప అధ్యక్షతన ఎంపీడీవో సిహెచ్. శ్రీనివాస్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్, ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛతాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం ఏపీ ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా పౌరుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతోంది. పరిశుభ్రత వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యం మేరకు శ్రమదానం కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి. శుభ్రతతో పాటు సమాజ సేవ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా తీసుకెళ్లాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొణతల. ప్రసాద్, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కోరసిక. శ్రీనివాస్, మంగిన. కొండ, అక్కబత్తుల. రాజు, అనిశెట్టి. రాదయ్య, కుడిదల శ్రీను, ఏ ఈ జి. గంగరాజు. బిల్ కలెక్టర్ కృష్ణ, వర్మ, రాజాబాబు, సచివాలయం సిబ్బంది పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్, వర్కర్స్ కు 11నెలల 15రోజుల వేతన బకాయిలు తక్షణమే ఇవ్వాలి.

రెండో రోజు కార్మికుల నిరసనకు మద్దత్తు
తెలిపిన సీఐటీయూ సిపిఎం నాయకులు



**పోలవరం, ప్రజా జ్యోతి న్యూస్ ఆగస్టు 23..** అర్ధాకలితో అల్లాడుతుతున్న శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్, వర్కర్స్ 11నెలల 15రోజుల వేతన బకాయిలు తక్షణమే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం. నాగమణి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టిసం(కన్నాపురం అడ్డరోడ్డు)వద్దశ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్, వర్కర్స్ బకాయి వేతనాలు కోసం చేపట్టిన నిరసన కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి,సిపిఎంజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కర్ లు బృందం వారికీ మద్దత్తు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి 17మండలాల్లో 200గ్రామాలలో సుమారు 6లక్షల మంది ప్రజలు సురక్షిత మంచినీటిని సద్వినియోగం చేసుకుంటున్నారని గుర్తు చేశారు.ఈ పథకంలో 18ఏళ్లుగా 110 మంది కార్మికులు పనిచేస్తున్నా కార్మికుల సంక్షేమం ఈ పాలకులకు పట్టడం లేదని విమర్శలు చేశారు.11నెలల వేతనాలు బకాయిలు ఉంటే కార్మికులు కుటుంబాలు ఎలా గడుస్తాయని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సుదీర్ఘ కాలంగా ఈ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత,ఇన్సూరెన్స్,ఈఎస్ఐ,పి ఎఫ్,వంటి సదుపాయాలు నేటికీ కల్పించకపోవడం బాధాకరం అన్నారు.ఎన్నికలకు ముందు శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ లో పనిచేస్తున్న కార్మికులను దత్తత తీసుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం పైబడిన కార్మికులను గాలికి వదిలేయడం ఈ కూటమి ప్రభుత్వంకు తగదని అన్నారు.బకాయి వేతనాలు కోసం నిరసన చేస్తున్న కార్మికులతో ప్రభుత్వం,అధికారులు తక్షణమే చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. లేని పక్షంలో కలసి వచ్చే సంఘాలు,ప్రజానీకంతో కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు.అనంతరం దీక్షా శిబిరం నుంచి పోలవరం ఏటిగట్టు సెంటర్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ అనంతరం మానవహారం చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జి శివ సత్యనారాయణ, సెక్రటరీ ఎ సత్యనారాయణ,వైస్ ప్రెసిడెంట్ బొంత ప్రసాద్,
ఉప కార్యదర్శి యం శ్రీనివాస్,సి హెచ్ పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రకాశం పంతులు జయంతి



**బాపట్ల ఆగస్టు 23 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పోరాట పటిమ, ఆత్మనిర్భరత నేటి యువతకు ఆదర్శమని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూన రాణి తెలిపారు. కళాశాలలో నిర్వహించిన జయంతి సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, నిరుపేద కుటుంబంలో జన్మించి న్యాయవాద విద్యను అభ్యసించి ప్రముఖ న్యాయవాదిగా నిలిచిన ఆయన, సైమన్ కమిషన్‌కు ఎదురొడి స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలియజేశారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధకుడిగా పోరాడి తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి విశిష్ట సేవలు అందించారని, పరిపాలనలో ఆయన చూపిన పారదర్శకత, ధైర్యం, వేగం విద్యార్థి లోకానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.

## కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సూచన

వినాయక మండపాలు, ఊరేగింపులకు పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరి




**కాకినాడ ఆగస్టు 23 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటు, ఊరేగింపుల నిర్వహణకు పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఐపీఎస్ తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం ద్వారా వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు పొందడానికి ఎటువంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తు సమర్పించిన తర్వాత సంబంధిత పోలీసులు పరిశీలించి కోడ్ మంజూరు చేస్తారని, వాటిని మండపాలలో తప్పనిసరిగా ఉంచాలని తెలిపారు. వినాయక ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు సూచనలు పాటించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ఫైల్ క్లియరెన్స్ లో మంత్రి రామానాయుడు కు ఫస్ట్ ర్యాంక్.



**ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్,హెూంమంత్రి అనిత, నాదెండ్ల మనోహర్,మూడు నాలుగు ఐదు స్థానాల్లో చోటు దక్కించుకున్నారు.**

**పాలకొల్లు ఆగస్టు 23 ప్రజాజ్యోతి ప్రతినిధి :** రాష్ట్ర మంత్రుల ఫైల్ క్లియరెన్స్ లో భాగంగా పాలకొల్లు ఎమ్మెల్యే, జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మలరామానాయుడు కు ఫస్ట్ ర్యాంక్ లభించినట్లు తెలిసింది.చివరి స్థానాల్లో కొల్లు రవీంద్ర,అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ ఉన్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఫైల్ క్లియరెన్స్ ఆధారంగా ర్యాంకుల కేటాయింపు చేసినట్లు తెలిసిందే .ఆయన తర్వాత ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రెండో స్థానంలో, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో ఉన్నారు. వీరి తర్వాత నాలుగో స్థానంలో హెూం మంత్రి అనిత, ఐదో స్థానంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చోటు దక్కించుకున్నారు.

## పాతపట్నం మహేంద్ర జూనియర్ కళాశాలలో శక్తి ర్ పై అవగాహన..




**పాతపట్నం ఆగస్టు 23 ప్రజా జ్యోతి న్యూస్..** జిల్లా ఎస్పీ కే.మహేశ్వర్ రెడ్డి ఆదేశాలమేరకు శనివారం నాడు పాతపట్నం స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో స్త్రీ శక్తి యాప్ ఆవశ్యకతను టెక్కలి డివిజన్ పోలీస్ అధికారులు వివరించారు. స్త్రీ శక్తి యాప్ ప్రతి అమ్మాయిల మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసి ఉంచాలని ఏ సమస్య వచ్చినా అందులో మహిళ సబ్ ఇన్స్పెక్టర్ నంబర్లు ఉంటాయని వాటికి కాల్ చేస్తే రక్షణ ఇస్తారని పేర్కొనడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెట్ట ఆంజనేయులు అధ్యాపకులు బివి రమణ శాంతారావు తదితరులు పాల్గొన్నారు

**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రజా జ్యోతి రిపోర్టర్. వీరబాబు**



ఈరోజు ప్రత్తిపాడు మండలం, పెద శంకర్లపూడిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏలేశ్వరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్య ప్రభ రాజా గారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ జ్యోతుల వీరస్వామి (పెదబాబు) గారిని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జ్యోతుల వీరస్వామి (పెదబాబు) గారిని శాలువాతో సత్కరించి, అభినందించిన ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్య ప్రభ రాజా గారు.ప్రత్తిపాడు

# లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం





**అన్నదానం మహా పుణ్యకారం... అధ్యక్షుడు లయన్ పసుపులేటి శ్యామ్**

**అన్నదాత సుఖీభవ... రీజనల్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్**

**రాయచోటి ఆగస్టు 23 ప్రజా జ్యోతి** లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి (మం) వల్లూరువాండ్ల పల్లి వాస్తవ్యులు వల్లూరు రిషిక రెడ్డి రెండవ పుట్టిన రోజు సందర్భంగా తండ్రి వల్లూరు సంజీవ రెడ్డి,తల్లి శ్రావణి దంపతుల ఆర్థిక సహాయంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అధ్యక్షుడు లయన్ పసుపులేటి శ్యామ్ తెలిపారు. అనంతరం దాతలు వల్లూరు సంజీవరెడ్డి,శ్రావణి దంపతులు మాట్లాడుతు ఈ రోజు మా కుమార్తె వల్లూరు రిషిక రెడ్డి రెండవ పుట్టిన రోజు సందర్భముగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్, కోశాధికారి కె.మనోహర్ రాజు, లయన్ శ్రీనివాసులు రెడ్డి లయన్ శ్రీనివాసులు, వృద్ధాశ్రమం సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు జయచంద్ర, మధుసూదన్ రెడ్డి ,లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు

# అన్ని దానములలో కెల్లా రక్తదానం గొప్పది





**గౌరవ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి ఆదేశాలతో ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల నందు ఆవశ్యక పరిస్థితులలో ప్రాణ అపాయంలో ఉన్నవారికి వెంటనే రక్తం అందుబాటులో ఉండే విధంగా రక్త నిల్వ ఉండాలన్నదే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి సూచనలతో రక్తదాన కార్యక్రమం**

**గాజుల ఖాదర్ బాషాతెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కుప్పం పరిశీలకులు**

**అన్నమయ్య జిల్లా ఆగస్టు 23 ప్రజా జ్యోతి** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా గౌరవ కలెక్టర్ శ్రీ చామకూరి శ్రీధర్ గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ గారు హాజరయ్యారు రాయచోటి. తాహ సిల్దార్ నరసింహ కుమార్ అధ్యక్షతన ప్రభుత్వ మదనపల్లె రక్త నిధి ఆసుపత్రి వైద్యులు హమీద్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టిడిపి కార్యదర్శి కుప్పం పరిశీలకులు గాజుల ఖాదర్బాషా హాజరయ్యారు అనంతరం ఆయన మాట్లాడుతూరక్తం ఇవ్వడం వల్ల ఒకరికి ప్రాణ దానం చేసినట్టు అని తెలిపారు అన్ని దానాలలో కెల్లా రక్తదానం గొప్పదని తెలియపరిచారు రక్తదానం ఇవ్వడం వల్ల ఆరోగ్యం కూడా బాగుంటుందని చెప్పారు ఎవరైతే ప్రాణాపాయ స్థితిలో ఉంటారు వారికి రక్తం అవసరమైనప్పుడు రక్తం ఇచ్చిన దాతకు దేవుడిలా వచ్చి కాపాడావని వారి గుండెల్లో నుండి దీవెనలు ఇస్తారు అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఖాదర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్తాన్ తెలుగుదేశం పార్టీ నాయకులు రోఫా రఫీ మరియు ఇర్షాద్ రెవెన్యూ అధికారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# చెక్కు పవర్ రద్దుకు స్టే ఇచ్చిన ఎ పి హైకోర్టు.

**నాకు సహకరించిన ప్రతి వైఎస్ఆర్సిపి నాయకులకు నా మనస్ఫూర్తిగా ధన్యవాదాలు, లక్ష్మి చంద్రిక**

**విచిరిన సవాల్ పై విజయం సాధించిన,సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక.**



**పోడూరు ఆగస్టు 23 ప్రజాజ్యోతి న్యూస్ :** ఇటీవల పండితవిల్లూరు గ్రామ సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక చెక్కు పవర్ ను రద్దు చేస్తూ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేసి ఆమె చెక్కు పవర్ ని నిలిపివేసిన విషయం విదితమే.కాగా ఇదే విషయాన్ని గ్రామ సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక సవాల్ చేస్తూ చెక్కు పవర్ రద్దును నిలుపుదల చేయాలని ఆచంట నియోజకవర్గంలోని వైఎస్ఆర్ సీపీ నాయకులలు,జడ్పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, పెనుమంట్ర జడ్పిటిసి కర్రీ సుభాషిని,పెనుమంట్ర ఎంపీపీ కర్రీ వెంకటనారాయణ రెడ్డి (వాసు),పోడూరు మండలం పార్టీ అధ్యక్షులు పిల్లి నాగన్న, గుబ్బల ఉష వీరబ్రహ్మం,గుడాల చంటిబాబు,పోతుమూడి రామచంద్రారావు,కోట వెంకటేశ్వరరావు,వంటి వైయస్సార్సీపి పార్టీలో పేరుగాంచిన అగ్ర నాయకుల సహకారంతో పోడూరు ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఆందోళన నిర్వహించి,తదనంతరం ఎంపీడీవో మంగ కుమారికి వినతి పత్రాన్ని అందజేసి తన చెక్కు పవర్ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.అయినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోవడంతో మాజీ మంత్రి,వైయస్సార్సీపీ, ఆచంట నియోజకవర్గం ఇంచార్జ్,చెరుకువాడ శ్రీరంగనాథరాజు అండదండలతో, జడ్పిటిసి సభ్యులు గుంటూరి పెద్దరాజు సహకారంతో ఇదే విషయంపై ఆమె ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు.రాష్ట్ర హైకోర్టు ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపిన అనంతరం పశ్చిమగోదావరి జిల్లా,పోడూరు మండలం పండితవిల్లూరు గ్రామ సర్పంచ్ ఇళ్ళ లక్ష్మీ చంద్రిక చెక్ పవర్ రద్దు పై స్టే హైకోర్టు స్టే విధించినట్లు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షపూరితంగా నాపై కుట్ర పన్ని నా చెక్కు పవర్ ని రద్దు చేయించారు తప్పితే నేను ఇటువంటి అక్రమాలకు పాల్పడలేదని పేర్కొన్నారు.అలాగే నేను కష్టకాలంలో ఉన్న సమయంలో నా విన్నంటే ఉండి నన్ను ప్రోత్సహించి నేను స్టే తెచ్చుకునేలా నాకు సహకరించిన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, జడ్పిటిసి సభ్యులు పెద్దిరాజు,కర్రి సుభాషిని రెడ్డి,ఎంపీపీ కర్రీ వెంకటనారాయణ రెడ్డి వాసు, పిల్లి నాగన్న, గుప్పల వీరబ్రహ్మం,గెద్దాడ ఏకలవ్య,పోతుమూడి రామచంద్రారావు వంటి వైఎస్ఆర్సిపి నాయకులకు నా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, ఇంకా ఎవరి పేరు అయినా మర్చిపోయి ఉంటే క్షమించాలని తెలియజేశారు. కాగా చెక్కు పవర్ రద్దును నిలుపుదల చేస్తూ హైకోర్టు స్టే ఇచ్చిన ఉత్తర్వులను జడ్పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు,సొసైటీ మాజీ చైర్మన్,గెద్దాడ ఏకలవ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మంతో కలిసి భీమవరం డిఎల్ పి ఓ కార్యాలయంలో డి ఎల్ పి ఓ యన్. రామనాథరెడ్డికి సమర్పించారు.

## మదనపల్లె ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల తనిఖీలు

**అన్నమయ్య జిల్లా ఆగస్టు 23 ప్రజా జ్యోతి** రైతు సేవాకేంద్రాలు, ఎరువుల దుకాణాలలో విజిలెన్స్ అండ్ ఫోర్స్ మెంట్ అధికారులు శనివారం సబ్ కలెక్టర్ కళ్యాణితో కలిసి తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు మదనపల్లెలో పలు ఎరువుల దుకాణాలతో పాటు మండలంలోని రైతు సేవా కేంద్రాలలో ఎరువులస్థాకు, విక్రయాలపై ఆరాతీశారు. ముఖ్యంగా యూరియ పక్కదారి పడుతోందన్న సమాచారంతో తనిఖీలు గొప్యంగా నిర్వ హించారు. ఈనిఖీల



విషయాన్ని బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్తగా వ్యవహరించడం విశేషం

## మట్టి వినాయక విగ్రహాలు మాత్రమే వాడాలని చిన్నారుల వినూత్న ప్రచారం






**(ప్రజా జ్యోతి న్యూస్) ఆగస్టు 23** వెల్దుర్తి లోని శారదా విద్య నికేతన్ కు చెందిన చిన్నారి విద్యార్థులు ఈనాడు ఈ టీవీ ఆధ్వర్యంలో నూటపదాహారు మట్టి గణపతి విగ్రహాలు తాము స్వయంగా చేసి ప్రదర్శించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో చేసిన అతి పెద్ద వినాయక విగ్రహాలను వాడకూడదని పర్యావరణానికి ముప్పు తేకూడదని మట్టితో చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని, పర్యావరణాన్ని కాపాడాలని చిన్నారులు గొప్ప సందేశాన్ని అందించారని పలువురు వారిని ప్రశంసిస్తున్నారు.

## భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన...

**శాప్ ఛైర్మన్ రవినాయుడు**



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ ఆగస్టు 22** విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ని ఆయన నివాసంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించడం జరిగిందిఅన్నా. శాప్ చైర్మన్ రవి నాయుడు వెంట శాప్ డైరెక్టర్లు కొవ్వాసు జగదీశ్వరి, పీబీవీఎస్ఎన్ బుచ్చిరాజు పాల్గొన్నారు.

## డీఎస్ఏ స్టేడియంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన...


**శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**




**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ ఆగస్టు 22** విశాఖపట్టణంలో ఈనెల 29న జరగనున్న "నేషనల్ స్పోర్ట్స్ డే" సందర్భంగా విశాఖ జిల్లా కొమ్మాదిలోని డీఎస్ఏ స్టేడియంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించడం జరిగింది. భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు , తెలుగుయువత నాయకులు గంటా రవితేజ ముఖ్య అతిధులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, పాడేరు, విశాఖ, మన్యం జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు కొవ్వాసు. జగదీశ్వరి, పీబీవీఎస్ఎన్ బుచ్చిరాజు, పలువురు అర్జున అవార్డు గ్రహీతలు, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

## హార్ట్ పేషెంట్ కి పెన్షన్ కట్, టెన్షన్ లో కుటుంబం..






**మెలియాపుట్టి ఆగస్టు 23 ప్రజా జ్యోతి న్యూస్..** దామోదర్ కుటుంబానికి పెన్షన్ పునరుద్ధరించాలని ఎమ్మెల్యేని కోరిన టీడీపీ యువ నాయకుడు శేపాన విక్రమ్.. పాతపట్నం నియోజక వర్గం మెలియాపుట్టి మండలం టకోయి గ్రామానికి చెందిన పల్లి దామోదర అనే వ్యక్తికి ఫెంక్షన్ నిలిపివేశారు. సదరు వ్యక్తి కి గుండె ఆపరేషన్ కూడా జరిగింది. పని చెయ్యలేని పరిస్థితి.ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. 2009 నుండి తనకి ఫెంక్షన్ వస్తుంది ఇప్పుడు ఫెంక్షన్ ఆపివేయడం తో దిక్కు తోచని పరిస్థితి లో వారి ఫ్యామిలీ ఉంది. ఈవిషయం టీడీపీ యువ నాయకులు శేపాన విక్రమ్ కి తెలియపర్చడం తో విక్రమ్ స్పందించి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టిలో పెట్టడం జరిగింది.ఈ కుటుంబ పరిస్థితి చూసి దామోదర్ కి మళ్ళీ ఫెంక్షన్ వచ్చేలా చెయ్యాలని ఆ కుటుంబ వీధిలో పడకుండా చూడాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కి విక్రమ్ విజ్ఞప్తి చేశారు..

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**గిరిజన సంక్షేమ స్పెషల్ అధికారిణి తేజేశ్వణి, మున్సిపల్ కమిషనర్ రవి**




**రాయచోటి ఆగస్టు 23 ప్రజా జ్యోతి** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రతి ఒక్కరు సంపూర్ణమైన ఆరోగ్యంగా జీవంచగలరన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ, స్పెషల్ అధికారిణి తేజేశ్వణి. అన్నమయ్య జిల్లా రాయచోటిలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాలు మేరకు మున్సిపల్ కమిషనర్ గుర్రం రవి,మెప్మా అధికారి అబ్బాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా గిరిజన సంక్షేమ, స్పెషల్ అధికారిణి తేజేశ్వణి ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి బస్టాండ్ కూడలి మీదగా నేతాజీ కూడలి వరకు కొనసాగింది.అక్కడ విద్యార్థులు, మున్సిపల్, మెప్మా అధికారులు తో పాటు సచివాలయం ఉద్యోగులు, సిబ్బందితో కలిసి మానవహారం నిర్వహించిస్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర యొక్క ఉద్దేశాన్ని ప్రతిజ్ఞా గావించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలలో మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజలకు పరిసరాలు,పర్యావరణం పరిరక్షణ, మొక్కలు నాటడం సంరక్షించడం తదితర అంశాల పై అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.వినాయక చవితి పండుగ సందర్భంగా వివద రసాయనల ద్వారా ఏర్పాటు చేసిన విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పర్యావరణం కలుషితం కాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

# రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం






**రక్తం అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం**
**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

**రాయచోటి, ఆగస్టు 23 ప్రజా జ్యోతి** జిల్లాలో రోగులకు అవసరమైన రక్తాన్ని నిరంతరం అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డిఆర్ఓ మధుసూదన్ రావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మీడియాతో మాట్లాడుతూ రోగులకు అవసరమైన రక్తాన్ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం 10 యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉందని తెలిసిన వెంటనే రెవెన్యూ అసోసియేషన్ స్పందించి కనీసం 200 యూనిట్ల రక్తాన్ని ఉచితంగా అందించేందుకు ముందుకు రావడాన్ని కలెక్టర్ అభినందించారు. రక్తదానం వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద రోగులకు ఎంతో తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో పంచాయతీ రాజ్, ఇతర ప్రభుత్వ విభాగాలు, విద్యాసంస్థలు, ఇంజనీరింగ్ కాలేజీల వంటి వర్గాలను కూడా రక్తదాన శిబిరాల్లో పాల్గొనేలా ఆహ్వానిస్తామని కలెక్టర్ తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షించి, అవసరమైన పండ్లు, జ్యూస్ అందజేస్తూ సురక్షితంగా రక్త సేకరణ చేపట్టాలని సూచించారు.రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్ మాట్లాడుతూ మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త యూనిట్లు తక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశాల మేరకు ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని, 200 యూనిట్ల రక్తాన్ని సేకరించడమే లక్ష్యమని తెలిపారు. పేద రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా రక్తాన్ని అందించడంలో ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రెవెన్యూ సిబ్బందికి, పాల్గొన్న ప్రతి ఒక్కరికి జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిద్దీక్, వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వివిధ డివిజన్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన రక్తదానం చేశారు. రక్తదానం చేసిన అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు పండ్లు పంపిణీ చేయగా, రాజంపేట సబ్ కలెక్టర్‌కు మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి జ్యూస్ అందజేశారు.

## సిపిఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డి మృతిపట్ల వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి సంతాపం



**అన్నమయ్య జిల్లా ఆగస్టు 23 ప్రజాజ్యోతి** సిపిఐ అగ్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. విద్యార్థి ఉద్యమాలతో ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన గొప్ప నేత అని అన్నారు. సిపిఐ అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంటు సభ్యుడిగా పలు బాధ్యతలు నిర్వహించారని.. వామపక్ష ఐక్యతకు కృషి చేశారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాలలో కీలక పాత్ర పోషించారని, వారి మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ , వారి కుటుంబ సభ్యులకు శ్రీకాంత్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు

## స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించిన పోలీసులు



**అన్నమయ్య జిల్లా ఆగస్టు 23 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహించబడుతున్న "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా.. పోలీసు అధికారులు సిబ్బంది కలిసి.. పోలీసు ప్రధాన కార్యాలయం, సబ్ డివిజన్ అధికారుల కార్యాలయాలు, సర్కిల్ ఇన్స్పెక్టర్ల కార్యాలయాలు, అన్ని పోలీస్ స్టేషన్లలో శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. కార్యాలయాల లోని పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేశారు.

## శంకరపట్నం కస్తూరిబా పాఠశాలలో 9 మంది విద్యార్థులపై ఎలుకల దాడి

**కరీంనగర్ :** నెల క్రితం సైదాపూర్ మహాత్మా జ్యోతిరావు పూలే సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల పై ఎలుకల దాడి ఘటన మరవక ముందే శంకరపట్నం కస్తూర్బా బాలికల విద్యాలయంలో తొమ్మిది మంది విద్యార్థులపై ఎలుకలు దాడి చేసి గాయపర్చడం కలకలం సృష్టిస్తుంది.కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కస్తూర్బా బాలికల విద్యాలయం లో విద్యార్థినుల పై ఎలుకలు దాడి చేశాయి. ఒకే సారి తొమ్మిది మంది విద్యార్థినుల పై దాడి చేసి గాయపర్చాయి. దీంతో భయాందోళాలకు గురైన విద్యార్థినులు సంబంధిత ప్రిన్సిపాల్ కు సమాచారం అందించడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలిసి స్థానిక ఏంఈఓ కస్తూర్బా బాలికల విద్యాలయానికి చేరుకొని విచారణ చేశారు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థుల పై ఎలుకలు దాడి చేసిన మాట వాస్తవమేనని వారికి చికిత్స అందించామని తెలిపారు. ఎలుకలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామన్నారు. అయితే కస్తూర్బా పాఠశాల నుండి తొమ్మిది మంది విద్యార్థినులు ఎలుకలు కరిచాయని వచ్చారని వారికి చికిత్స అందించామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.బైట్ –

## హుజురాబాద్‌లో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు...

**కుక్కల బెడదకు చెక్ పెట్టేలా అధికారుల చర్యలు**

**కరీంనగర్ :** కరీంనగర్ జిల్లాలో కుక్కల బెడదకు చెక్ పెట్టేలా హుజురాబాద్ మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వీధి కుక్కలను పట్టుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. హుజురాబాద్ మునిసిపల్ పరిధిలో ఇటీవల కుక్కలు హల్చల్ చేస్తున్నాయి. కోతులతో పాటు కుక్కలు దాడి చేసి గాయపరుస్తుండడంతో వాటిని పట్టుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే పనిలో మున్సిపల్ అధికారులు నిమగ్నమయ్యారు. కుక్కలను పట్టుకోవడానికి యు పి నుండి ప్రత్యేక టీమ్ ను రంగం లో దించారు. పట్టణంలో






Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com